ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

కథా నిలయం
శ్రీకాకుళం

జనవరి 6, 2008

# భూగర్భరైళ్లు... భలే...భలే..

# హ్యాపీ బర్త్‌డే

(జనవరి-6నుంచి జనవరి-12 వరకు)

బి. మృదుల
జనవరి-7
సత్య-రోజ
అమరావతి-మహారాష్ట్ర

ఆర్.నవ్యశ్రీ
3సం॥, జనవరి-7
లక్ష్మి-చంద్రశేఖర్
హైదరాబాద్

జి. అభిషేక్
జనవరి-6
జి.కళ్యాణి-శివకుమార్
అజిత్‌సింగ్‌నగర్-విజయవాడ

జి. సాయికిరణ్
10సం॥, జనవరి-1998
లక్ష్మి-యాదగిరి
మజీద్‌పల్లి-మెదక్

ఎస్. సాత్విక
సుజాత-బోసుబాబు
తాడేపల్లిగూడెం-ప॥గో॥

డి.వి. మనీష
8సం॥, జనవరి-12
రమ-వెంకటేశ్వర్లు
వరంగల్

టి. స్వాతిశ్రీ
9సం॥, జనవరి-10
అనంతలక్ష్మి-సుబ్రమణ్య
గూడాల-తూ॥గో॥



ఎం. రాహుల్
10సం॥, జనవరి-11
బేబీరాణి-నర్సింహారావు
గట్టయ్యసెంటర్-ఖమ్మం

సాయి నిహారిక
1సం॥, జనవరి-2007
దుర్గ-వరప్రసాద్
రాజేంద్రనగర్-రాజమండ్రి

కథా నిలయం
శ్రీకాకుళం

# అభ్యుదయ సాహిత్యం ఆవశ్యకత పెరిగింది

**మన అతిథి**

| | | |
|---|---|---|
| పేరు | : | మువ్వల పెరుమాళ్లు |
| తల్లిదండ్రులు | : | సుబ్బమ్మ, సుబ్బరామయ్య |
| పుట్టిన తేదీ | : | 9-8-1924 |
| జన్మస్థలం | : | ప్రకాశం జిల్లా, దొనకొండ దగ్గరలోని గంగదేవిపల్లి |
| విద్య | : | ప్రాథమిక విద్య |
| నచ్చిన వ్యక్తులు | : | మహా నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు, రచయితలు బెల్లంకొండ రాందాస్, రెంటాల గోపాలకృష్ణ |
| బలం | : | కమ్యూనిస్టు సిద్ధాంతం, పుస్తకాలు చదవడం |
| బలహీనతలు | : | సిగరెట్ల తాగటం |
| మర్చిపోలేని సంఘటన | : | 1950 ఏప్రిల్ 13న గుంటూరుజిల్లా రక్తసిక్తం కావటం, పోలీసులు తుమ్మలపాలెం వద్ద 12 మందిని కాల్చి చంపటం |
| అలవాట్లు | : | ఎక్కువగా పుస్తక పఠనం, నచ్చిన సబ్జెక్టునే పుస్తకంగా ప్రింట్ చేయటం |
| ప్రస్థానం | : | 1942లో కమ్యూనిస్టుపార్టీలో చేరి 1952 వరకు పనిచేశాను. ఈ సమయంలో 3 సంవత్సరాలు అండర్‌గ్రౌండ్‌లో గడిపాను. 1953 నుండి 55 వరకు నవశక్తి పబ్లికేషన్స్... 1955లో జయంతి పబ్లికేషన్స్ స్థాపించాను. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచనలతోపాటు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలు, సాంఘిక, సామాజికాంశాల ఇతివృత్తంగల రచనల ప్రచురణ. |
| నచ్చిన పుస్తకం | : | జయంతి పబ్లికేషన్స్ ప్రచురణ సుందరయ్య రాసిన 'తెలంగాణా సాయుధ పోరాటం-గుణపాఠాలు', దర్శి చెంచయ్య రాసిన 'నేను-నా దేశం', ఉన్నవ లక్ష్మీనారాయణ సృజించిన 'మాలపిల్ల' నవల |
| ఆశయం | : | దోపిడీ-పీడన లేని సోషలిస్టు రాజ్యం సాధించుకోవాలని... |
| ధ్యేయం | : | రష్యా, చైనా తదితర కమ్యూనిస్టు దేశాల్ని ద్వేషించే రచనలు ప్రింట్ చేయకూడదని, అమ్మకూడదని. అలాగే మన దేశాన్ని కించపర్చే పుస్తకాలు కొనటం, అమ్మటం చేయకూడదని. విదేశీ ప్రచురణలు అమ్మటం, వారి సహకారం పొందకూడదని, పరుల ఆర్థిక సహకారంతో పుస్తకాలు ప్రింట్ చేయకూడదనేది నా ధ్యేయం. |

ఆనాడు ఆదర్శాలు, ఆశయాలతో పుస్తక ప్రచురణ ప్రారంభమైంది. పుస్తకాలు కూడా చౌకగా లభించేవి. కమీషన్ అంటే ఏమిటో ఆ రోజుల్లో తెలియదు. ఏ ప్రచురణ కర్త అచ్చు వేసినా కొనేవారు. ప్రచురణ సంస్థ పేరుతో వారు వెలువరించే సాహిత్యానికి విలువలు తెలిసేలా ఉండేవి. మరి ఈనాడో... పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఏది లాభమని తోస్తే ప్రచురణకర్తలంతా అటుగా పరుగులు తీస్తున్నారు. ప్రచురణ రంగం దెబ్బతినటానికిదో కారణం. మరో కారణం జిల్లా గ్రంథాలయ సంస్థలకు ఓ ఆశయం లేకపోవడం. ఆ రోజుల్లో మాగ్జిమ్ గోర్కీ, టాల్‌స్టాయ్, పుష్కిన్, గొగోల్, చెహోవ్ తదితర సోవియట్ రచయితల రచనలు కూడా బాగా ప్రచురించారు. ప్రజల అభిరుచుల్లో మార్పు వచ్చింది. తేలిగ్గా చదవగల్గే నవలా సాహిత్యం కొన్నాళ్లు, కెరీర్ డెవలప్‌మెంట్ సాహిత్యం ఇప్పుడు ఆదరణ పొందుతోంది. పొలిటికల్ పుస్తకాల ప్రచురణ తగ్గింది. సమాజాన్ని విశ్లేషించి అర్థమయ్యే రీతిలో ప్రజల జీవన గతిలో మార్పుతెచ్చే అభ్యుదయ సాహిత్యం ఆవశ్యకత నేడు మరింతగా పెరిగింది.

## ఈ సంచికలో....


| | | |
|---|---|---|
| టపా | ... | 2 |
| విజ్ఞాన వీచిక | ... | 4 |
| సీరియల్ | ... | 8 |
| మనసా... తెలుసా... | ... | 10 |
| సినిమా కబుర్లు | ... | 11 |
| బాలనేస్తాలు | ... | 12 |
| అట్టమీది కథ | ... | 14 |


## ఇంకా...




| | | |
|---|---|---|
| లాహిరి లాహిరిలో | ... | 20 |
| సలహాలు | ... | 22 |
| రుచి | .... | 23 |
| కొత్త పుస్తకాలు | ... | 24 |


మంచిపుస్తకం ...6

ప్రవృద్ధ పాత్రికేయుని ప్రసిద్ధ కథనాల వెనక...

తెలుసుకుందామా...3

*విశాఖలో మహాబౌద్ధ స్థావరం!*

కథ ... 18

కమలమ్మగారికి క్షమాపణలు



## విందు భోజనం

కడప జీవ వైవిధ్య ప్రతీకలైన ఎర్రచందనం, కృష్ణాపురం ఉల్లి పూర్వోత్తరాలు, విశిష్టతలు, ప్రయోజనాలు వివరించిన తీరు ఆసక్తికరంగా ఉంది. కలివికోడి (జెర్డాన్ కోర్సర్) ప్రపంచ వ్యాప్తంగా అంతరించిపోతున్న పక్షి. మన కడప నల్లమల అటవీ ప్రాంతంలో ఇరవై ఏళ్ళ క్రితం ప్రపంచ ప్రఖ్యాత పక్షిశాస్త్రవేత్త సలీం అలీ తన జీవితాశయంగా ఎదురు చూసిన ఆ పక్షిని ప్రత్యక్షంగా చూసిన సంఘటనలు కళ్ళ ముందు కదలాడాయి. అలాగే పత్రికా రంగంలో పేరు మోసిన సంపాదకుల కాలం నుండి ఉత్తేజితుల్ని చేసిన పలు పత్రికల పేర్లు స్థాపించిన సంవత్సరం తదితర వివరాలు చూస్తుంటే మంచి విందు భోజనం వడ్డించినట్లుగా ఉంది. తెలుసుకుందామా... శీర్షికలోని ఈ కథనం అక్షర సత్యంగా నిలుస్తుందనటంలో సందేహం లేదు. కె.పి. ఉల్లి సర్వ రోగ నివారణిగా పని చేస్తుందని చెప్తూ...దాని విశిష్టతలు వివరించారు. కాని ఉల్లిపాయ (ఎర్రగడ్డ)30 సెంటీమీటర్ల వ్యాసం అని ప్రచురితమైనది. మిల్లీ మీటర్ల బదులు సెంటీమీటర్లుగా పొరపాటున ప్రింటింగ్ జరిగిందేమో!

యర్రమోతు ధర్మరాజు,
ధవళేశ్వరం, తూర్పుగోదావరి.

## పుస్తక పరిచయం బాగుంది

కవర్ స్టోరీ కడపకు 200 యేళ్ళు బాగుంది. మరింత ఎక్కువగా విషయాలు తెలియచేస్తే బాగుండేది. తెలంగాణా పోరాట యోధుడు, చిర్రావూరి లక్ష్మీనర్సయ్య గురించి రాసిన పుస్తక పరిచయం బాగుంది. చిర్రావూరి గురించి చదవడమంటే సాయుధ పోరాటం గురించి తెలుసుకోవడమే. మెదడు గురించి చాలా విషయాలు తెలియచేశారు. కార్టూన్లు పిల్లలను అలరించాయి.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

## ఆలోచింపచేస్తున్నాయి

ఇండియన్ సినిమా గురించి డా॥ వైద్య రాస్తున్న వ్యాసాలు ఆలోచింపచేసేవిగా ఉన్నాయి. ప్రస్తుత మన సినిమాలు అధోజగత్తులో ఉన్నాయి. ప్రేక్షకులను కూడా వాటితో పాటు తీసుకుపోతున్నాయి. దీన్ని ఆపాలి. ప్రేక్షకుల అభిరుచిని మార్చాలి. జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రాలుగా ఎంపికైన ప్రాంతీయ భాషా చిత్రాలనో, ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమంగా ఎంపికైన చిత్రాలనో మళ్లీ ఒకసారి దూరదర్శన్ ద్వారా చూపిస్తూ కొంత వరకైనా ప్రేక్షకులను మంచి సినిమాల వైపు మళ్లించవచ్చు. వారి అభిరుచిని పెంపొందించవచ్చు. ఉత్తమ చిత్రాలకు సంబంధించి విరివిగా వ్యాసాలు, రచనలు రావాలి.

ఎన్. సుబ్బారావు,
గుంటూరు.

## 'ఎత్తుకు పై ఎత్తు' బాగుంది

ఎర్రచందనం, కెపి ఉల్లి, కలివి కోడి, బ్రౌన్ అనుబంధం, బ్రహ్మంగారు, అన్నమయ్య మహామహుల జన్మస్థలమైన కడప ధన్యము. కల్లాకపటం లేని మన స్తత్వాలు... చులకన చేస్తే చంపే మనస్తత్వాలు, వీరనారిగా, వీరభూమిగా కడప చరిత్ర ధన్యము. సమాధుల మధ్య భోజనాలా? మినప పునుగులు, కొబ్బరి కారాలు దివ్యంగా ఉంటాయి. ఎత్తుకు పై ఎత్తు చిన్న కథ బాగుంది. అంగారక వైచిత్రాలు బాగుంది.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

## కడప చరిత్ర కళ్ల ముందు కదలాడింది

ఈ వారం కవర్ చదివాక చాలా ఆనందం వేసింది. కడప జిల్లాకు సంబంధించిన చరిత్ర మొత్తం కళ్ల ముందు కదలాడింది. ఆ జిల్లాలో జన్మించిన కళాకారులు, సామాజిక వేత్తలు, రాజకీయ నాయకుల గురించి చెప్పారు. అంతేకాక అక్కడ చూడదగిన, ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల గురించి చెప్పారు. జిల్లాకు సంబంధించిన సమాచారం సమగ్రంగా ఇచ్చినందుకు సంతోషం. పైగా ఉల్లి, కలివికోడి, ఎర్రచందనం గురించిన పూర్తి వివరాలు అందించారు. అంతేకాక




ఆ జిల్లా నుంచి వచ్చిన పత్రికల గురించి చెప్తూ... వాటి వివరాలు ఇచ్చారు. మొత్తంమీద ఈ వారం స్నేహ పుస్తకం కడపకు సంబంధించిన సమాచారం మొత్తం అందించినందుకు ధన్యవాదాలు. సందర్భాన్ని బట్టి ప్రతి జిల్లాకు సంబంధించిన సమాచారాన్ని ఇదేవిధంగా అందిస్తారని ఆశిస్తున్నాం.

కె.పద్మ, ఒమ్మెవరం,
ప్రకాశం.

## నాన్ వెజ్ వంటకాలు మరిన్ని రావాలి

వంటల పేజీ బాగుంటోంది. అయితే ఇందులో నాన్‌వెజ్ వంటకాలు మరిన్ని రావాలని కోరుకుంటున్నాం. అలాగే ఆ పేజీలో పాఠకుల నుంచి ఆహ్వానం పెడితే అందరూ రాసి పంపిస్తారుకదా. మీరు ఆ పని చేస్తే బాగుంటుంది. బాలల కథ బాగుంది. 'బాలనేస్తాలు' పిల్లలకు విజ్ఞానదాయకంగా వస్తోంది.

ఎం. శైలజారెడ్డి, భీమిలి.




## ఆహ్వానం

**మీరు జోక్స్ బాగా వేస్తారా! వాటిని విన్న మీ స్నేహితులు, సహోద్యోగులు, ఇరుగుపొరుగు పడీపడీ నవ్వుతారా! మరైతే ఇంకా ఆలోచిస్తున్నారేంటండీ బాబూ. మా పాఠకులను కూడా మీ జోక్స్‌తో కడుపుబ్బా నవ్వించండి. గిలిగింతలు పెట్టండి. మీరు రుచికరమైన వంటలు, అల్పాహారాలు, పానీయాలు... చేస్తుంటారా. వెజ్, నాన్ వెజ్ కూరలు వెరైటీగా చేస్తుంటారా. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకోండి. మీరు మాకు పంపదలచుకున్న వంటకానికి కావాల్సిన పదార్థాలు, కొలతలు, వండే విధానం వివరంగా రాసి మాకు పంపండి. ప్రచురిస్తాం.**

మా చిరునామా: ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి,
స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

తెలుసుకుందామా...

కథా నిలయం

పి.భవానిప్రసాద్

# విశాఖిలో మహాబౌద్ధ స్థావరం!



శిథిలమైన స్థూపం

బుద్ధం శరణం గచ్ఛామి.. ధర్మం శరణం గచ్ఛామి... సంఘం శరణం గచ్ఛామి... అంటూ శాంతి, అహింస పరమధర్మాలుగా ప్రవచించిన బౌద్ధం వర్ధిల్లిన మరో ప్రాంతమే విశాఖకు సమీపంలోని ధారకొండ. సింహాచలం సమీపంలో పురాతన బౌద్ధ స్థావరం ఉన్నట్టు కొన్ని పరిశోధనా పుస్తకాల్లో పేర్కొనడం మినహా నాటి అవశేషాలు, చరిత్ర నేటికీ ప్రపంచానికి తెలీదు. ఆ అంశాలను గతంలో ఓ పురావస్తు ఔత్సాహికుడు కనుగొని ఆ శాఖ దృష్టికి తీసుకెళ్లినా పెద్దగా స్పందన లేదు. ఈ నేపథ్యంలో మరోసారి ఆ అంశాలను వెలికితీసి ప్రపంచదృష్టికి తీసుకువచ్చేదే ఈ ప్రత్యేక కథనం.

సింహాచల కొండకు ఉత్తరాన వున్న కంబాలకొండ రిజర్వ్ ఫారెస్ట్‌లో మూడు కిలోమీటర్ల లోపల దట్టమైన అటవీప్రాంతంలో బౌద్ధ అవశేషాలున్నాయి. ఆంధ్రలోనే అతి పెద్ద స్థూపంగా చెప్పబడుతున్న స్థూపం ఇక్కడ శిథిలమై కనిపిస్తోంది. స్తంభాలతో నిర్మించిన ఒక మండపం అర్ధచంద్రాకారపు ఆకృతిలో చంద్రశిల, కొన్ని కొండపెంకులు కనిపించాయి. స్థూపం విషయానికి వస్తే ఇది బౌద్ధంలోని హీనయాన శాఖకు చెంది నదిగా తెలుస్తోంది. దొరికిన అవశేషాలను బట్టి క్రీస్తు శకం ఒకటో శతాబ్దిలో ఈ నిర్మాణం జరిగి ఉండవచ్చునని ఆర్కియాలజిస్టులు చెప్తున్నారు. బౌద్ధంలోని స్థూపాల నిర్మాణం అశోకుని కాలంలోనే మొదలైంది. అంతకుముందు మట్టి దిబ్బలే ఉండేవి. క్రీస్తు పూర్వం మూడో శతాబ్ది నుంచి బౌద్ధంలో స్థూపాల నిర్మాణం జరిగింది. ఇప్పుడు మనంచూస్తున్న స్థూపం నిర్మాణాన్ని పరిశీలిస్తే హీనయాన బౌద్ధం అవలంబించేవారు నిర్మించినట్టు తెలుస్తోంది. ఇక్కడ లభించిన స్థూప అవశేషాల్లో స్థూపం యొక్క కింది భాగం కనిపిస్తుంది. దానిపైన స్థూపం శిథిలమైపోయింది. ఈ స్థూపం గాంధారశైలి (తక్షశిల)ని పోలి ఉంది. బౌద్ధులు చర్చలకోసం నిర్మించుకున్న సమావేశ మందిరం శిథిలాలు కన్పిస్తున్నాయి. చతురస్రాకారంగా స్తంభాలు నిలబెట్టి, వాటిమీద గాడికొట్టి రూట్ నిర్మించుకునేవారు. లభించిన ఒక పిల్లర్ ఎత్తు నాలుగు మీటర్ల 30 సెంటీమీటర్లు ఉంది. ఇక్కడ దొరికిన ఇటుకలు 54 సెంటీమీటర్లు పొడవు, 27 సెంటీమీటర్ల వెడల్పు, 8 సెంటీమీటర్ల మందంతో ఉన్నాయి. శిథిలమైన స్థూపం ప్లాట్‌ఫారంలో పదివరసల ఇటుకలు కన్పిస్తున్నాయి. కొండపెంకులు నలుపు, ఎరుపు రంగుల్లో కన్పిస్తున్నాయి. అర్ధచంద్రాకారంలో దొరికిన చంద్రశిల కింద అందమైన డిజైన్ కనిపిస్తోంది. స్థూపానికి పక్క గానుగాదేవారని తెలుస్తుంది. దాని అవశేషాలు కనిపించడం లేదు. ఇటుకలు, చెక్కసున్నంకోసం ఈ గానుగను ఉపయోగించుకునేవారని తెలుస్తుంది. చుట్టుపక్కలున్న బౌద్ధ ఆరామాలన్నింటికీ ఇది ప్రధానమైన కేంద్రమై ఉండొచ్చు. ప్రధానంగా నీటి లభ్యత ఉన్నచోట బౌద్ధ స్థూపాలు రూపుదిద్దుకుంటాయి. విశాఖలో వెలుగుచూసిన బౌద్ధ ఆరామాలు తొట్లకొండ, బావికొండలకు నీటి సదుపాయం లేదు. తొట్టిలో నీటిని నింపుకొని బౌద్ధులు వాడేవారని దొరికిన అవశేషాలను బట్టి తెలుస్తోంది. ధారకొండలో బయటపడిన స్థూపం వద్ద సహజసిద్ధమైన జలధార ఉండటంతో ఈ బౌద్ధ స్థూపానికి నీటి కొరత లేదు. బౌద్ధులకు ఇష్టమైన, ఆహ్లాదకరమైన వాతావరణం ఇక్కడ వుంది. కొండల మధ్య ఎత్తయిన ప్రదేశంలో ఈ స్థూపాన్ని నిర్మించారు. అక్కడనుంచి చూస్తే ఎత్తైన కొండలు కనిపిస్తాయి. ధ్యానం, యోగా చేయడానికి ఇవి ఎంతో అనువైన ప్రదేశాలు. వివిధ శాస్త్రాలు, అధ్యయనం చేయడానికి, చర్చించడానికి ఈ వాతావరణం బౌద్ధులకు ఎంతో అనుకూలంగా ఉండేది. వారికి అవసరమైన ఔషధాలు అడవి నుంచే సేకరించుకునేవారు. ఇలా అన్ని రకాలుగా బౌద్ధులకు ఈ ప్రాంతం సౌకర్యంగా ఉండటంతో ఇది పురాతన బౌద్ధ స్థావరమని నిపుణులు నిర్ధారిస్తున్నారు. ఇక్కడ తవ్వకాలు చేపడితే ఈ మహాబౌద్ధ స్థావరం అవశేషాలు, బౌద్ధులు నివసించే ఆరామాలు, ప్రార్థనా మందిరాలు వెలుగుచూస్తాయి.

## ఎలా వెళ్లాలి?

ఈ బౌద్ధ స్థావరం వద్దకు వెళ్లాలంటే అత్యంత వ్యయ ప్రయాసలతో కూడిన పని. సింహాచలం కొండ సర్వే నెంబరు 275లో జలుగులోవ అనే ప్రదేశం ఉంది. దానికి ఎదురుగా కంబాల కొండ రిజర్వ్ ఫారెస్టు ఉంది. దీనికి ఆనుకుని పైనాపిల్ కాలనీ ఉంది. ఈ ప్రాంతం మీదుగా రిజర్వు ఫారెస్టులోకి వెళ్లాలి. తొలుత గుబురుగా పెరిగిన చిట్టడివి ఉంటుంది. దారి చేసుకుంటూ ముందుకుపోతే దట్టమైన అడవిలో ప్రవేశిస్తాం. కొంతదూరం వెళ్లాక జలధార కనిపి స్తుంది. దానిగుండా మూడు కిలోమీటర్లు లోపలికి పోతే బౌద్ధ స్థావరానికి చేరుకుంటాం. ఈ అడవిలో క్రూరమృగాలు, విష సర్పాలు సంచరిస్తూ ఉంటాయి. ఒంటరిగా వెళ్లడ ప్రమాదకరం. కాబట్టి నలుగురైదు గురు కలిసి వెళ్లాల్సిందే. చేతిలో ఆయుధాలు కూడా ఉండాలి మరి!

## దొంగలు, స్మగ్లర్ల బారినపడిన బౌద్ధ స్థావరం

ఎవరికి పట్టని ఈ బౌద్ధ స్థావరంపై దొంగలు, స్మగ్లర్ల కళ్లుపడినట్టు ఈ ప్రాంతంలో కనిపించిన ఆధారాలను బట్టి తెలుస్తుంది. బౌద్ధస్థూపం చుట్టూ తవ్వకాలు కనిపిస్తున్నాయి. ఇక్కడికి రిజర్వు ఫారెస్టు సిబ్బంది, ఆర్కియాలజీశాఖ సిబ్బంది రాలేదని, తవ్వకాలు జరపలేదని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ బౌద్ధ స్థావరంలోని ప్రాచీన విగ్రహాల గురించి అలగ్జాండర్ రే చెప్పినట్లు ముచిలింద నాగ బుద్ధుని విగ్రహం కోసం ఈ తవ్వకాలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ బౌద్ధస్థావరంపై పూర్తి సమాచారంతోనే తవ్వకాలు జరిపినట్లు తెలుస్తోంది. బౌద్ధ స్థూపంలో ఒక పక్క పది అడుగుల పొడవు, వెడల్పు ఉన్న చతురస్రాకారపు గొయ్యి, 15 అడుగుల వరకూ తవ్వారు. అక్కడి నుంచి ఒక మూల రెండడుగుల వరకూ తవ్వి పురాతన వస్తువులను తస్కరించినట్లు అర్థమవుతోంది. మరోపక్క స్థూపానికి చెందిన ఇటుకలను పెకలించి వంట చేసినట్లు తెలుస్తోంది. దీన్నిబట్టి తవ్వకాలు జరిపిన వారు కొన్ని రోజుల పాటు ఇక్కడే ఉన్నట్లు అర్థమవుతోంది. ఈ విషయమై గ్రామస్తులను ప్రశ్నిస్తే 20 రోజుల క్రితం కొందరు ఈ కొండమీదకు వెళ్లారని చెప్పారు. కొండవైపు వెళ్లడం అంత మంచిది కాదని వారికి చెప్పామన్నారు. ఈ విషయమై స్టేట్ ఆర్కియాలజీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.చిట్టిబాబును ప్రశ్నించగా, బౌద్ధ స్థావరాల్లో విలువైన వస్తువులు దొరకవని చెప్పారు. తవ్వకాలు జరిపిన వారికి పూర్తి అవగాహన ఉండవచ్చునని చెప్పారు. పురావస్తు విగ్రహాల కోసం, బౌద్ధ స్థావరం స్థూపంలో భద్రపరిచే వాటి కోసం తవ్వకాలు సాగించి ఉండవచ్చునని తెలిపారు. గతంలో తాము ఇక్కడ తవ్వకాలు జరిపించామని, రిజర్వు ఫారెస్టు కావడంతో ఫారెస్టు వారికి లేఖ రాశామని చెప్పారు. వారి నుంచి అనుమతి లేదని చెప్పారు. ఇక్కడికి వెళ్లడం అత్యంత వ్యయప్రయాసలతో కూడిన పనని, అందువల్ల కొంత వెనక్కు తగ్గామని తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టి తవ్వకాలు జరిపితే ఉత్తరాంధ్రలో బౌద్ధానికి ఉన్న అనుబంధానికి సంబంధించిన ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు దొరకవచ్చునని తెలిపారు. చరిత్రలో కలిసిపోయిన ఇటువంటి కొండను వెలుగులోకి తెచ్చి భావితరాలకు అందిస్తే మన సంస్కృతికి జీవం పోసిన వారమవుతాం.

విజ్ఞాన వీచిక

# ఇంటింటికీ విద్యుత్ కేంద్రం

ఎస్. వెంకట్రావు

ఇప్పుడు మనం చెల్లిస్తున్న విద్యుత్ ఛార్జీలకన్నా తక్కువ ఖరీదుకు స్వంతంగా మన ఇంటిలోనే విద్యుత్ ఉత్పత్తి చేసుకోగలిగితే సంతోషించని వారెవరైనా ఉంటారా? విద్యుత్ స్థంభాలకోసం, కరెంటు కనెక్షన్లకోసం ఆఫీసుల చుట్టూ తిరిగే బాధ లేకుండా ప్రతి ఒక్కరూ తమ ఇంటిలో, లేకుంటే రెసిడెన్షియల్ కాంప్లెక్సుల్లో స్వంతంగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు నెలకొల్పుకోగలిగితే.....అటువంటి రోజులు త్వరలోనే రానున్నాయని ఇటీవల నానో టెక్నాలజీ రంగంతో జరుగుతున్న ఆధునిక పరిశోధనలు తెలుపుతున్నాయి.

నానో టెక్నాలజీతో సోలార్ ప్యానల్స్ ప్రింటింగ్

అభివృద్ధికి ఇంధనంగా బొగ్గు, చమురును మండించే స్థితినుండి సౌర శక్తిని అన్నివిధాలుగా వినియోగించుకోగల స్థితి వస్తే మానవాళి ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారమవుతాయి. బొగ్గు, చమురు మొదలైన శిలాజ ఇంధనాలు వాడుతున్న కొద్దీ తరిగిపోయేవే కాని కొత్తగా ఉత్పత్తి కావు. ప్రస్తుతం ఈ ఇంధనాల వెలికితీత గరిష్ట స్థాయికి చేరిందని నిపుణులు చెబుతున్నారు. అంటే ఉన్న వనరులన్నిటినీ వినియోగంలోకి తెచ్చారు, ఇంకా కొత్త వనరులు కనుగొనే అవకాశాలు బహు తక్కువ. మరోవైపు ప్రపంచ వ్యాపితంగా దేశాలు అభివృద్ధిలో పోటీ పడుతున్నాయి. 130 కోట్ల జనాభా ఉన్న చైనా ఏటా 10 శాతం అభివృద్ధి చెందుతోంది. అంటే పదేళ్లలో రెట్టింపుకుపైగా అభివృద్ధి సాధిస్తోంది. ఈ అభివృద్ధి ప్రధానంగా చమురు, బొగ్గు వినియోగం మీద ఆధారపడి జరుగుతోంది గనుక పదేళ్లలో ఈ దేశంలో చమురు వినియోగం రెట్టింపవుతోంది. దేశంలోని ఇంధన వనరులు చాలక అది ఆఫ్రికా, మధ్య ఆసియా, లాటిన్ అమెరికా దేశాలలోని ఇంధన వనరులను ఉపయోగించుకోవడానికి దౌత్యరీత్యా పావులు కదుపుతోంది. దేశీయ ఇంధనావసరాల్లో 70 శాతం దిగుమతి చేసుకుంటున్న భారత దేశం కూడా చైనా పంథానే అనుసరిస్తోంది. వంద కోట్ల జనాభా ఉన్న భారత్ కూడా ఇటీవలి కాలంలో 6 నుండి 8 శాతం అభివృద్ధి సాధిస్తోంది. ఇంక అభివృద్ధి చెందిన అమెరికా, యూరప్ తదితర దేశాల గురించి చెప్పనే అక్కరలేదు. చమురు ఇంధనం కోసం అమెరికా ఏకంగా దేశాలకు దేశాలనే దురాక్రమిస్తోంది. ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్‌లను ఆక్రమించింది. ఇరాన్‌ను ఆక్రమించడానికి సిద్ధపడుతోంది.

కాని చమురుకోసం వెంపర్లాడకుండా ఎంచక్కా సౌరశక్తిని ఇంధనావసరాలకోసం ఉపయోగించుకుంటే... వాడుకుంటే సౌరశక్తి తరిగిపోయేది కాదు. ప్రపంచంలో అన్ని చోట్లా లభిస్తుంది. ప్రస్తుతం అనేక రంగాల్లో సౌరశక్తిని వినియోగిస్తున్నా దాని ధర అందనంత ఎత్తులో ఉంది. ఉదాహరణకు, ఉపగ్రహాలు, అంతరిక్ష వాహనాల్లో విద్యుదుత్పత్తికి ప్రధానంగా సౌరశక్తినే ఉపయోగిస్తున్నారు. కాలిక్యులేటర్ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను సౌరవిద్యుత్ బ్యాటరీలతో నడుపుతున్నారు. ఇప్పుడిప్పుడే నీళ్ల వేడిచేసు కోడానికీ, విద్యుద్దీపాలకోసం సౌరశక్తి వినియోగం పెరుగుతోంది. ఇంత చేస్తున్నా సౌరశక్తి వినియోగం చమురు మాదిరిగా ప్రజలను ఆకర్షించలేకపోవడానికి ఒక ప్రధాన అవరోధం దాని ఉత్పత్తి ఖర్చు అధికంగా ఉండడమే. వాణిజ్య రీత్యా చూసినప్పుడు ఎవరైనా చౌకగా లభించేదాన్నే వినియోగిస్తారు. చమురు ఇంధనం, బొగ్గు తదితరాల కన్నా సౌరవిద్యుత్తు అధిక ధర పలుకుతున్నంత కాలం ప్రభుత్వాలు ఎన్ని ప్రోత్సాహకాలు ఇచ్చినా ప్రజలుగాని, వాణిజ్య సంస్థలు గాని సౌరవిద్యుత్తును ఉపయోగించబోవు. అలా కాకుండా మామూలు విద్యుత్తు కన్నా సౌర విద్యుత్తు చౌకగా లభిస్తే అప్పుడు దాని వినియోగాన్ని ఎవరూ అడ్డుకోలేరు. ఇప్పటివరకు బొగ్గుద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్తు అంటే థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ఖర్చు ఒక యూనిట్‌కు సుమారు రెండున్నర రూపాయలకు పైన అవుతుంటే సౌర విద్యుదుత్పత్తికి మూడు రెట్లు ఎక్కువ ఖర్చవుతోంది.

థర్మల్ విద్యుత్తును బొగ్గు కాల్చడం ద్వారా ఉత్పత్తి చేస్తుంటే ఫోటో వోల్టాయిక్ సెల్స్ ద్వారా సౌరశక్తిని విద్యుత్తుగా మారుస్తారు. థర్మల్ విద్యుదుత్పత్తిలో ప్రధానంగా బొగ్గు ఖరీదు గణనలోకి వస్తుంది. సౌరవిద్యుదుత్పత్తిలో సౌర శక్తి ఉచితంగా అభిస్తుంది కాని దాన్ని విద్యుత్తుగా మార్చే ఫోటో వోల్టాయిక్ సెల్స్ ఖరీదు ఇక్కడ ప్రధానంగా గణనలోకి వస్తుంది. ఈ ఫోటో వోల్టాయిక్ సెల్స్ ఉత్పత్తి ఖరీదును గనుక గణనీయంగా తగ్గించగలిగితే సౌర విద్యుదుత్పత్తి ఖర్చు తగ్గిపోతుంది. సౌర సెల్స్ మాస్ ప్రొడక్షన్ ద్వారా థర్మల్ విద్యుత్తుకన్నా తగ్గిస్తే అప్పుడు ప్రజలూ, వాణిజ్య సముదాయాలూ సౌరవిద్యుత్తు వైపుకే మొగ్గుచూపుతారు. ఒకసారి సౌరవిద్యుత్ వినియోగంలోకి వస్తే చాలా ఉపయోగాలుంటాయి. చమురు వినియోగం తగ్గుతుంది. ఎందుకంటే అప్పుడు వాహనాలకు కూడా సౌరవిద్యుత్ ఉపయోగించవచ్చు. వాతావరణ కాలుష్యం తగ్గిపోతుంది. గ్రీన్ హౌస్ వాయువుల విడుదల తగ్గి భూగోళం వేడెక్కడం అనే సమస్య తీరిపోతుంది. అంతే కాదు చౌకగా లభించే ఫోటో వోల్టాయిక్ సెల్స్ వినియోగంలోకి వస్తే అప్పుడు ఎవరికి వారు తమ ఇళ్లలోనే ఈ

సెల్స్ నెలకొల్పుకుని సూర్యరశ్మిని విద్యుత్తుగా మార్చుకోగలుగుతారు. అప్పుడు స్థంభాలు, కనెక్షన్ల ఛార్జీల గొడవ ఉండదు. అయితే ఇదంతా జరగాలంటే ఫోటో వోల్టాయిక్ సెల్స్‌ను చౌకగా - థర్మల్ విద్యుత్‌కన్నా చౌకగా ఉత్పత్తి చేయగలగాలి. అంటే సౌరవిద్యుత్ ఉత్పత్తిలో బ్రేక్‌త్రూ రావాలి.

అటువంటి బ్రేక్‌త్రూ తాము సాధించామని అమెరికాకు చెందిన 'నానో సోలార్' అనే సంస్థ ఇటీవల ప్రకటించింది. 2001లో కాలిఫోర్నియాలోని పోలో ఆల్టోలో నెలకొల్పిన ఫ్యాక్టరీలో ఈ సంస్థ నానో టెక్నాలజీని ఉపయోగించి కారుచౌకగా ఫోటో వోల్టాయిక్ సెల్స్ ఉత్పత్తిని ప్రారంభించింది. ప్రస్తుతం మార్కెట్‌లో లభ్యమవుతున్న ఫోటో వోల్టాయిక్ సెల్ ప్యానల్స్ ఖరీదు- వాట్ విద్యుత్ ఉత్పత్తికి 3 డాలర్లు అంటే సుమారు 120 రూపాయలు అవుతోంది. నానో సోలార్ సంస్థ దీన్ని ఒక డాలరు కన్నా తక్కువకు (99 సెంట్లకు) తగ్గించగలిగింది. అంటే రు. 40 కన్నా తక్కువకే ఉత్పత్తి అవుతుందన్న మాట. థర్మల్ విద్యుదుత్పత్తి ఖరీదు కూడా సుమారు అంతే పడుతుంది. అంటే థర్మల్ విద్యుత్తుతో సమానంగా ప్రస్తుతం ఈ సంస్థ సౌరవిద్యుత్ ప్యానల్స్‌ను ఉత్పత్తి చేయగలుగుతోంది. నానో టెక్నాలజీని ఉపయోగించుకోవడం ద్వారా ఇది తనకు సాధ్యమైందని చెబుతోంది. నిజానికి అర డాలరుకు అంటే సుమారు 20 రూపాయలకు వాట్ సౌరవిద్యుత్ ప్యానల్ ఉత్పత్తి చేయాలనేది ఈ సంస్థ లక్ష్యం. అదే జరిగితే విద్యుత్ ఛార్జీలు ప్రస్తుత స్థాయికన్నా సగానికి సగం తగ్గించేయవచ్చు.




కాగితం మీద అక్షరాలు అచ్చువేసే పద్ధతిలో పలుచని అల్యూమినియం షీట్ మీద ప్రింట్ చేయడం ద్వారా ఈ సంస్థ సౌరవిద్యుత్ ప్యానల్స్‌ను తయారుచేయగలుగుతోంది. సోలార్ ప్యానల్స్ ప్రింటింగ్‌కు అది నానో టెక్నాలజీని ఉపయోగించుకుంటోంది. గత డిసెంబర్ మధ్య నుండి ఫ్యాక్టరీలో మాస్ ప్రొడక్షన్ ప్రారంభించినట్లు సంస్థ ఇటీవలనే ఒక ప్రకటనలో చెప్పింది. వెనువెంటనే దీని సోలార్ ప్యానల్స్ గిరాకీ బాగా పెరిగిపోయింది. 2009 మధ్య వరకు ఉత్పత్తి అయ్యే ప్యానల్స్‌కు ఇప్పటినుండే ఆర్డర్లు బుక్ అయిపోవడంతో సంస్థ జర్మనీలో ఒక కొత్త ఫ్యాక్టరీ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఈ సంస్థ ఇళ్లలోకి ఉపయోగించే సౌర ప్యానల్స్ ఉత్పత్తిమీద కాకుండా 10 మెగా వాట్ విద్యుత్ కేంద్రాలకు ఉపయోగపడే ప్యానల్స్ ఉత్పత్తిపై కేంద్రీకరించింది. 10 మెగావాట్ల సౌరవిద్యుత్ కేంద్రం నిర్మాణానికి కేవలం ఆరు నుండి తొమ్మిది నెలలు సరిపోతుందని సంస్థ ప్రతినిధులు చెప్పారు. గతంలో ఇంటర్‌నెట్ వ్యాపార వేత్తగా ఉన్న మార్టిన్ రోషీసెన్ తన కంపెనీని 45 కోట్ల డాలర్లకు యాహూ కంపెనీకి అమ్మేసి వచ్చిన డబ్బుతో గూగుల్, అమెరికా ప్రభుత్వంతో కలిసి నానో సోలార్ సంస్థను నెలకొల్పాడు. పలుచని ఫిల్మ్ టెక్నాలజీతో కూడిన చౌకైన సోలార్ ప్యానల్స్ తయారు చేయాలన్న లక్ష్యంతో సిలికాన్ వ్యాలీలో ఈ సంస్థను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జపాన్, చైనా, యూరప్, అమెరికాల్లో సౌరవిద్యుత్ చౌకగా తయారుచేసే సోలార్ సెల్స్ టెక్నాలజీ రూపకల్పనకోసం పోటీ నడుస్తోంది. ఈ పోటీలో ముందుగా బ్రేక్‌త్రూ సాధించిన నానో సోలార్ సంస్థ తన టెక్నాలజీ గురించి మాత్రం బయటకు సమాచారం ఇవ్వడం లేదు. అయితే థర్మల్ విద్యుత్ కన్నా తక్కువ ఖరీదు గల సౌరవిద్యుత్ ప్యానల్స్ సరఫరాకు ఆర్డర్స్ మాత్రం పెద్ద ఎత్తున బుక్ చేసుకుంటోంది. కొత్త ఫ్యాక్టరీలు నెలకొల్పడానికి పథకాలు సిద్ధం చేసుకుంటోంది.

మొత్తం మీద మనం గతంలో అనేక సార్లు చెప్పుకున్నట్లు నానో టెక్నాలజీ మానవ జీవితంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. నానో సోలార్ సాధించిన విజయం ఈ క్రమంలో మొదటిది, దానితో పోటీపడుతున్న సంస్థలు కూడా ముందుకు వస్తే సౌరవిద్యుత్ ఉత్పత్తి కారుచౌక అయ్యే అవకాశం ఉంది. మానవాభివృద్ధికి ఇది మరింత ఊపునిస్తుందనడంలో సందేహం ఉండనక్కరలేదు. ❇



తెర

ప్రేమలోనూ,యుద్ధంలోనూ ఏదైనా చెల్లుతుందని ఇంగ్లీషులో ఒక నానుడి. సమాచార సేకరణకూ ఈ సూత్రం వర్తిస్తుందనేది పాత్రికేయుల విశ్వాసం. ఇతరులకు హాని కలిగించనంత వరకూ అన్ని మార్గాలనూ వార్తావసరాలకు ఉపయోగించుకోవడానికి వారు ఎల్లవేళలా తాపత్రయపడుతుంటారు. ఈ విషయంలో భారతీయ పాత్రికేయుడైన కులదీప్ నయ్యర్‌ది ప్రథమ శ్రేణి. వృత్తిపరంగానూ, వయస్సులోనూ కూడా ఆయన అగ్రగణ్యుడు. అత్యున్నత నేతలతో ప్రత్యక్ష పరిచయం వున్న నయ్యర్ దాదాపు ఆరు దశాబ్దాలకు పై బడి పత్రికా రంగంలో పండిపోయారు. ఆయన అందరికన్నా ముందుగా ఇచ్చిన ఎన్నో ప్రత్యేక వార్తలు దేశంలో సంచలనాలకు తెర తీశాయి.వాటన్నిటి వెనక వున్న సత్యాసత్యాలనూ పరిస్థితులనూ ప్రభావాలనూ సవివరంగా వెల్లడించే పుస్తకం ఆయన 'కథనాల వెనక కథలు'.




# ప్రవృద్ధ పాత్రికేయుని ప్రసిద్ధ కథనాల వెనక....

కులదీప్ నయ్యర్ సంపాదకుడుగా వ్యాఖ్యానాలకే పరిమితమై పోకుండా ఇప్పటికీ ప్రత్యక్షంగా రంగంలోకి దిగి సమాచారం సేకరించే క్రియాశీల పాత్రికేయుడు. ప్రత్యేకించి ప్రగతిశీల వాది కాకపోయినా ప్రజాస్వామ్య ప్రియుడుగా అత్యవసర పరిస్థితిలో కారాగార శిక్ష అనుభవించారు కూడా. పలువురు మంత్రుల దగ్గర పత్రికా సంబంధాల అధికారిగా, రాయబారిగా, రాజ్యసభ సభ్యుడుగా కూడా బహుముఖ బాధ్యతలు నిర్వహించారు.ప్రత్యేక వార్తల సేకరణలో తన అనుభవాలను గుదిగుచ్చి 'స్కూప్' అనే పుస్తకం రాశారు. 'స్కూప్' అన్న ఇంగ్లీషు మాటకు 'ఇతర పత్రికలపై ఆధిక్యత సాధించిన వార్త' అని అర్థం. ఆ పుస్తకానికి ప్రముఖ రచయిత, అనువాదకుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అనుసృజనం ఇది.

తను పాత్రికేయ వృత్తి చేపట్టడానికి దారి తీసిన పరిస్థితులను ఉపోద్ఘాతంలో వివరించారు. దేశ విభజన తరుణంలో 22 ఏళ్ల కులదీప్ నయ్యర్ న్యాయవాద విద్య అభ్యసించేవారు. ఆయన స్వస్థలమైన సియాల్ కోట్ ఇప్పుడు పాకిస్తాన్‌లో వుంది. ఆ కల్లోలిత ఘట్టంలో చాలా మంది భారతీయ హిందువుల లాగే ఆయన కూడా సరిహద్దులు దాటుకుని ఢిల్లీ తిరిగివచ్చారు.అవసరం కోసం ఒక చిన్న పత్రికలో చేరాడు.అయితే స్వార్థ దృష్టితోనే చేర్చుకున్న ఆ పత్రికాధిపతి అది నెరవేరదని తెలియగానే తొలగించాడు. తర్వాత మరో చిన్న ఉర్దూపత్రికలో చేరినా ఇంగ్లీషు నేర్చుకోవడం మంచిదని ఒక కవి ఇచ్చిన సలహాతో అమెరికా వెళ్లి జర్నలిజంలో ఉన్నత విద్యనభ్యసించి వచ్చారు. సంచలనాత్మకమైన పలు కథనాలకు కర్త అయిన కులదీప్ నయ్యర్ వాటిలో ముఖ్యమైన కొన్నింటి నేపథ్యం ఇందులో వివరించారు.

" దాదాపు రెండు దశాబ్దాల పాటు వార్తలను వేటాడుతూ అందరికంటే ముందుగా వార్తలను రాసేందుకు పోటీ పడుతూ గడిపాను. ప్రభుత్వం విలువైందిగా భావించి దాచిన సమాచారాన్ని బయటకు తీయడంలో వచ్చే ఆనందం ఒక విలేకరిగా పనిచేయడం ద్వారా పొందాను.... ఒక వర్తమాన చరిత్ర కారుడుగా కీలకమైన పరిణామాలను రికార్డు చేస్తూ దేశానికి సేవ చేస్తున్నాననే భావన పొందడం ఈ ఉద్వేగంలో భాగం" అని నయ్యర్ ముందు మాటలో పేర్కొన్నారు. తాము జాతీయ పరిణామాలలో ఎలా భాగమైనారో, రాజకీయ నాయకులు కూడా తమ అభిప్రాయాలు ప్రజలకు చెప్పేందుకు ఎలా ఉపయోగించుకున్నారో తెలిపారు. ఈ యుగంలో కూడా పాత్రికేయ వృత్తి ముగిసిపోలేదని, పోటీ మాత్రం పెరిగిందని అభిప్రాయపడ్డారు. "కాని ఎవరు వినూత్నమైన వార్తాకథనాలను కూపీ లాగగలరో వారికే కిరీటం దక్కుతుంది" అని ముందుమాట ముగించారు.

ఈ పుస్తకం ఆరు భాగాలుగా వుంది. 'దేశ విభజన' మొదటి భాగం. 1948 జనవరి 30న గాంధీజీ హత్య జరిగిన నాటి పరిస్థితితో ప్రారంభమవుతుంది..పాత్రికేయ వృత్తి ద్వారానే గాంధేయవిలువను ప్రచారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఇదే పుస్తకంలో మొదటి అధ్యాయం. తర్వాతి మూడు అధ్యాయాలు దేశ విభజనకు మూలపురుషుడైన జిన్నాతో, ఆ ప్రక్రియకు నేతృత్వం వహించిన లార్డ్ మౌంట్ బాటెన్‌తో, విభజన రేఖలు నిర్ణయించిన రాడ్‌క్లిఫ్‌లతో నయ్యర్ జరిపిన ఇంటర్వ్యూల సారాంశం. జిన్నాతో అనుకోకుండానూ, మిగిలిన వారితో ప్రయత్న పూర్వకంగానూ సమావేశమయ్యారు. విభజన పర్యవసానాలు ఇంత కల్లోలితంగా వుంటాయని జిన్నా గాని, మౌంట్ బాటెన్ గాని వూహించలేదన్న వాదనతో నయ్యర్ ఏకీభవించలేదు.అలాగే సమయం లేకపోవడం వల్ల దేశ విభజనలో సరిహద్దులను హడావిడిగా నిర్ణయించామని రాడ్‌క్లిఫ్ చెబుతాడు.

'నెహ్రూ రోజులు' అన్న రెండవ భాగంలో రెండే అధ్యాయాలున్నాయి. హిందీ భాషను అధికార భాషగా ప్రకటించేందుకు దారి తీసిన పరిస్థితులు, దానిపై సాగిన ఆందోళనానంతర మార్పుల క్రమాన్ని దానిలో వేర్వేరు నేతల పాత్రను ఇందులో చెప్పారు. నెహ్రూ అనంతరం వారసుడి ఎంపికలో లాల్‌బహదూర్ శాస్త్రి, మొరార్జీ

దేశాయిల మధ్య సాగిన మూడు ముక్కలాటగా సాగిన ప్రహసనాన్ని తర్వాతి అధ్యాయంలో చెప్పారు. అయితే ఈ సందర్భంగా తాను మొరార్జీ నివాసానికి వెళ్లి వచ్చి రాసిన కథనం శాస్త్రికి ఉపయోగపడిందన్నారు. ఇందుకు ఆయన పరోక్షంగా కృతజ్ఞత కూడా చెబుతారు.

'ప్రధాన మంత్రిగా శాస్త్రి' అన్న మూడవ భాగంలో వృత్తిపరంగా పలు ఆసక్తికరమైన అంశాలున్నాయి. ముఖ్యంగా ఆ కాలంలో పాకిస్తాన్ సైనిక దాడులు, భారత దేశ స్పందనలు ఈ వ్యూహ ప్రతివ్యూహాల లోతు పాతులు సాధికార వర్గాల సమాచారంతో సేకరించారు. లాల్ బహదూర్ హయాంలో పంజాబ్ ముఖ్యమంత్రి ప్రతాప్ సింగ్ ఖైరాన్‌పై వచ్చిన అవినీతి ఆరోపణల విచారణ నివేదికను నయ్యర్ న్యాయమూర్తినుంచి కాపీలాగి ముందస్తుగా కథనం ప్రచురించారు. నిర్ధారించిన ఆరోపణ చాలా చిన్నదైనా పత్రికలో రావడంతో ఖైరాన్ రాజీనామా చేయకతప్పలేదు.

మరోసారి బిజూ పట్నాయక్‌పై విచారణకు జస్టిస్ ఖన్నా కమీషన్‌ను నియమించారు. ఆ నివేదికను పరిశీలించేందుకు క్యాబినెట్ మంత్రులైన అశోక్‌సేన్, కృష్ణమాచారి, ఎంసిచాగ్లాలతో కమిటీని నియమించారు. నయ్యర్ అశోక్‌సేన్ ద్వారా దాని ప్రతి సంపాదించి వార్త ప్రచురించారు. దానిపై దుమారం రేగడంతో దర్యాప్తుకు ఆదేశించారు. తనకు ఇచ్చిన అశోక్ సేన్ నివేదిక ప్రతి నలిగిపోయింది. దాన్ని చూస్తే ఆయనను బలిచేసినట్టువుతుంది. అందుకే నయ్యర్ బృందం ఎన్నో తంటాలు పడి కృష్ణమాచారి దగ్గరున్న నివేదిక ప్రతిని కూడా సంపాదించి బాగా నలిపివేస్తుంది. అయితే ప్రధాని శాస్త్రి తన రాజకీయ వ్యతిరేకత కారణంగా కృష్ణమాచారిని తొలగించారు! లాల్‌బహదూర్ తాష్కెంట్‌లో హఠాత్తుగా మరణించిన ఘటనను తర్వాతి అధ్యాయంలో కథనం చేశారు. ఇక శాస్త్రి మరణానంతరం ఇందిరాగాంధీ ప్రధాని అయిన తీరును తర్వాత చెప్పారు.

'ఇందిర రాజ్యం' అన్న తర్వాతి భాగంలో ఎమర్జన్సీ రోజులను, అప్పట్లో తన నిర్బంధాన్ని, దాన్ని ఎత్తివేసి ఎన్నికలు జరపడాన్ని రాశారు. ఇందిరను ఎంపిక చేసిన కాంగ్రెస్ పాతకాపులలో ఒకరైన నిజలింగప్ప డైరీ అధ్యాయం వాటిలో ఆసక్తికరమైంది. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి సంబంధించిన పరిణామాలపై ఒక పెద్ద అధ్యాయం తెలుగు వారికి ప్రత్యేకత కలిగింది. 'నెరవేరని జెపి కల' అన్న అధ్యాయంలోనూ, 'శిథిలాల నుంచి పునరుద్ధరణ'లోనూ ఇందిరాగాంధీ పునరాగమనాన్ని రికార్డు చేశారు.

'ఉపఖండంలో ఉద్రిక్తతలు' అన్న ఆఖరి భాగంలో భారత పాక్ సంఘర్షణలు, ఒప్పందాల విశేషాలు వివరించారు. పాకిస్తాన్ అణుబాంబు రూపొందించిన శాస్త్రవేత్త డా. అబ్దుల్ ఖాదర్ ఖాన్‌ను కలుసుకుని నయ్యర్ రాసిన ప్రత్యేక కథనం ప్రపంచాన్ని ఆకర్షించింది. అయితే ఇది ఆయనకు అనుకోకుండా కలసి వచ్చిన అవకాశం. 1987 జనవరి 27న ఒక పెళ్లికి హాజరవడం కోసం పాకిస్తాన్ వెళ్లిన ఆయనకు అక్కడి సంపాదకుడు ఒకరు ఈ ఇంటర్వ్యూ ఏర్పాటు చేశారు. పాకిస్తాన్ బాంబు కలిగివున్నట్టు సూత్రప్రాయంగా చెప్పడం కోసం ఇది జరిగింది. అయితే నయ్యర్ ప్రశ్నలకు రెచ్చిపోయిన ఖాన్ అనుకున్నదానికన్నా ఎక్కువ సమాచారం ఇచ్చి తన దేశాన్ని చిక్కులలో పెట్టాడు. 1999లో వాజ్‌పేయి లాహోర్‌కు బస్సు దౌత్యంతో పుస్తకం ముగుస్తుంది. ఆ సమయంలోనే కార్గిల్ సంక్షోభం మొదలవుతుంటుంది.......

నయ్యర్ వ్యక్తుల గురించి రాసినంతగా చారిత్రక నేపథ్యం రాజకీయ శక్తుల గురించి రాయకపోవడం లోపం. అమెరికాపై ప్రత్యేకించి విమర్శలు వుండవు. సోవియట్, చైనాల గురించిన విమర్శలు, విసుర్లు వుంటాయి. ఇవి ఆయన భావాల ప్రతిబింబాలనుకోవచ్చు. యార్లగడ్డ తెలుగు చక్కగా సాగుతుంది. కొన్ని పదాల ఎంపికలోనూ, పేర్లు తేదీల ప్రచురణలోనూ తప్పులు దొర్లాయి. పత్రికా రంగానికి సంబంధించిన వారు, ముఖ్యంగా విలేకరులు తప్పక చదవాల్సిన గ్రంథం.

**కులదీప్ నయ్యర్ కథనాల వెనుక కథలు**
**అనుసృజన: ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్,**
**వెల: 100/-, పేజీలు:178,**
**ప్రతులకు: లోక్‌నాయక్ ఫౌండేషన్, ఇంజనీరింగ్ కాలేజ్, స్టాఫ్ క్వార్టర్స్, ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం.**






కథా నిలయం
శ్రీకాకుళం

భార్యతో ఎస్కిమింజన్

మూలం : బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)

తెలుగు సేత: ముక్తవరం పార్థసారథి

# అమెరికన్ డేగ

### జరిగిన కథ:

మంగాస్‌తో కలిసి తెల్లవాళ్లను ఎదిరించిన రోజుల్లో ఫోర్ట్ బావి నుండి టూసన్ దాకా వుత్తరాలు చేరవెయ్యటానికి కాంట్రాక్టు తీసుకున్నాడు. టాగ్లిటో అయితే, యుందులో ఉన్న ప్రాణభయంతో త్వరలోనే వ్యాపారం నుండి విరమించుకున్నాడు. ఆ తర్వాత మరి కొన్నాళ్లకు వచ్చి, అపాచీలు తనను చంపనని వాగ్దానం చేస్తే, వ్యాపారం కొనసాగించుకొంటానని ప్రాధేయపడ్డాడు. ఈ వింత కోరిక విని విస్తుపోయాడు కాచైస్. తెల్లవాళ్లు తమ కాళ్ల మీద పడి వేడుకోవటం యిదే మొదటిసారి కాబోలు. వెంటనే అభయమిచ్చాడు. ఆ తర్వాత టాగ్లిటో బాగా లాభపడ్డాడు. కాచైస్ అనుచరులతో కూడా స్నేహం పెరిగింది. అనేకసార్లు అందరూ కూర్చుని టిస్విన్ (మద్యం) సేవించారు.

### 34వ భాగం

కాచైస్‌ను "జనరల్" అంటూ సంబోధించి, యితర సైనికాధికారులకు పరిచయం చేశాడు టాగ్లిటో. అందరూ ఒకర్నొకరు ఆలింగనం చేసుకొని, కొంతసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత.

"మీరింత దూరం ఎందుకు వచ్చారో అర్థం కావటం లేదన్నాడు" కాచైస్.

"ప్రెజిడెంట్ గ్రాంట్, మన 'గ్రేట్‌ఫాదర్' మీతో సంధి చేసుకొమ్మని పంపాడు" అన్నాడు దళనాయకుడు జనరల్ ఆలివర్ ఓటిస్ హోవార్డ్.

"అంతకన్నా కావలసిందేముంది"! అంటూ ఆనందంతో పొంగిపోయాడు కాచైస్. కెనడా అలామోసా నుండి తరలించినా తామెవరి మీద దాడికి పాల్పడలేదు. తిండి దొరక్క గుర్రాలు చిక్కిపోతున్నాయి.

రయోగ్రాండ్ వద్ద ఉన్న రిజర్వేషన్‌కెళ్లి సుఖంగా బతకమన్నాడు హోవార్డ్.

"అక్కడ బాగానే ఉంటుంది. కాకపోతే మా సంఖ్య చాలా ఎక్కువ. కొంతమందిని ఇక్కడే వదిలివెళ్ళిపోతే తెగ చీలిపోతుంది. మేమెవ్వరికే అపకారమూ చెయ్యం. మావాళ్లనిక్కడే స్వేచ్ఛగా తిరగనివ్వండి" అన్నాడు కాచైస్.

హోవర్డ్‌కి సలహా నచ్చింది. అయితే వీళ్ళు సంచరించగలిగే ప్రాంతానికి సరిహద్దులు ఏర్పాటు చెయ్యాలి. "డ్రాగూన్ పర్వతాల నుండి రయోగ్రాండ్ దాకా మాకు అనుమతినివ్వండి" అన్నాడు కాచైస్.

జనరల్ ఆలివర్ ఓటిస్ హోవార్డ్ సీనియర్ సైనికాధికారి. వెస్ట్ పాయింట్ (సైనిక కళాశాల) నుండి డిగ్రీ తీసుకున్న తర్వాత గెట్టీస్ బర్గ్ యుద్ధంలో పాల్గొన్నాడు. ఆ తర్వాత వర్జీనియాలోని ఫెయిర్‌ఫాక్స్ సమరంలో ఒక చెయ్యి పోగొట్టుకున్నాడు. కాచైస్ ఆతిథ్యంలో పదకొండు రోజులు గడిపి, అపాచీల ఆప్యాయతకు ముగ్ధుడయ్యాడు. చిరికాహువా స్త్రీలూ, పిల్లలు కూడా అతడి మనసు దోచుకున్నారు.

"అలమోసాకు బదులు బిగ్ సల్ఫర్ స్ప్రింగ్, రాడ్జర్స్ రాంచ్, చిరికాహువా పర్వతాలు వీళ్ల నివాసస్థలంగా నిర్ణయించాలి" అంటూ పై అధికారులకు అర్జీ పంపాడు. అయితే చట్ట ప్రకారం ఇండియన్ల పాలనా అధికారిగా ఒక తెల్లవాడే వుండాలి. కాచైస్ దీనికి అభ్యంతరం చెప్పలేదు. టాగ్లిటో టాం జెఫోర్డ్ – ఆ బాధ్యతలు నిర్వర్తించవచ్చు.

తన తెలివితేటలతో కాచైస్ శాంతి సాధించగలిగాడు గాని, డెల్షే నాయకత్వంలోని టాంటో అపాచీలకూ, ఎస్కిమింజన్ అనుచరులైన అరావాఫియాలకూ యిక్కట్లు తప్పలేదు.

సన్‌ఫ్లవర్ వాలీలో ఏజెన్సీ ఏర్పాటు చెయ్యమన్న డెల్షే అభ్యర్థనకు అధికారుల నుండి జవాబు రాలేదు. టాంటోలు వేట కోసం వెళ్ళినప్పుడు, వీళ్లను వేటాడమని సైనికులను పంపాడు గ్రేవుల్ఫ్. 1872లో ప్రారంభమైన ఈ ఘర్షణలు 1873, ఏప్రిల్ (టైం ఆఫ్ ది బిగ్ లీవ్స్) నాటికి తీవ్ర రూపం దాల్చాయి. సైనికులను ఎదిరించలేని అపాచీలు తెల్లజెండా ఎగరవేశారు.

ఆ తర్వాత, పరాజితులైన టాంటోలు మేజర్ జార్జి ఎం. రాండాల్ పర్యవేక్షణలో వైట్ మౌంటెన్ రిజర్వేషన్‌లో ఉన్న ఫోర్ట్ అపాచీకి తరలిపోయారు. అక్కడ సైనికులు అపాచీల మెడలకు, కుక్కలకు తగిలించినట్లుగా, పట్టీలు వేశారు. వాటిమీద నంబర్లు కూడా ఉండటంతో తప్పించుకున్న వాళ్లెవరో యిట్టే తెలిసిపోయేది. రిజర్వేషన్‌లో ఏర్పాట్లు సరిగాలేవు. ఎవరికీ చెయ్యటానికి పని లేదు. తినటానికి తిండే లేదు. అధికారులను ఖైదీలకన్న హీనంగా చూశారు. స్వేచ్ఛా జీవులైన యిండియన్లకిది నరకప్రాయమే.

1873, జులై (టైం ఆఫ్ ది రైప్‌నెస్) నాటికి అపాచీలకీ పరిస్థితి దుర్భరమై అధికారులతో ప్రత్యక్షయుద్ధానికి సిద్ధపడ్డారు. వీలైతే రమోవెర్డ్ రిజర్వేషన్‌కు చేరుకోవాలనుకున్నారు. అక్కడి ఏజెంట్ ఒక సివిలియన్. సదుపాయాలు కూడా యిక్కడి కన్నా మెరుగ్గా వున్నాయి. డెల్షే అక్కడికి చేరుకున్నాడు.

ఆ వేసవి కాలంలో, సాన్ కార్లోస్ ఏజెన్సీలో జరిగిన ఒక తిరుగుబాటులో లెఫ్టినెంట్ జేకబ్ ఆల్మీ హతుడయ్యాడు. భయంతో అపాచీలందరూ పారిపోయారు. కొందరు రమోవెర్డ్ వైపు కదిలారు. నేరస్తులందర్నీ చేరదీస్తున్నాడని డెల్షే మీద అభియోగం మోపి, తక్షణమే అరెస్టుకు ఆదేశించాడు. అరెస్టు కావటమంటే కాళ్లకూ,

చేతులకూ యినుప గొలుసులు తగిలించుకుని ఒక పదహారడుగుల బోనులో జంతువులా గడపటం. ఎత్తుకు పై ఎత్తుగా, డెల్షే తన అనుచరులతో టాంటో బేసిన్‌కు పారిపోయాడు.

సైనికులు వెంటాడతారని తెలుసు. తనను పట్టుకునే దాకా వూల్ఫ్‌కు నిద్ర కూడా పట్టదు. అయినా, కొన్ని నెలల పాటు ఎవరికీ చిక్కలేదు డెల్షే. సైనికుల సేవలు కేవలం ఒక్క మనిషి కోసం వినియోగించుకోవటం జనరల్ క్రూక్‌కు కూడా నచ్చలేదు. ఈ వేటకు యితర అపాచీలనే వినియోగిస్తే ప్రయోజనం నెరవేరదా? డెల్షేను పట్టించిన వాళ్లకు బహుమతి ప్రకటించాడు (డెడ్ ఆర్ అలైవ్). జూలై 1874లో ఇద్దరు అపాచీలు క్రూక్‌కు సమాచారం చేరవేశారు. తమ వద్ద డెల్షే 'తల' వుందని. ఇద్దరి దగ్గరా వుండటం అసంభవమని తెలిసినా, నిరుత్సాహపరచకుండా బహుమతి యిస్తానన్నాడు క్రూక్. కనీసం, అపాచీలలో భయం పెంచటానికైనా అవి ఉపయోగపడతాయి. రెండు తలకాయల్నీ కర్రలకు కట్టి రమోవెర్డ్, సాన్ కార్లోస్‌లలో ప్రదర్శించాడు.

ఎస్కిమింజిన్, అరావైపాలకు కూడా భద్రత కరువైంది. 1871లో కాంప్‌గ్రాంట్‌కు కొలియర్ రాక తర్వాత, తమ గ్రామాన్ని పునః నిర్మించుకుని నేలసాగు చేసుకున్నారు. నారు కూడా వేశారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి, వాళ్లందర్నీ మరో అరవై మైళ్ళ దూరం వెళ్లమని ఆదేశించింది ప్రభుత్వం. అలా, అరావైపాలందరూ జిలానది పక్కనున్న సాన్ కార్లోస్ ఏజెన్సీకి చేరుకున్నారు. ఇదంతా 1873 ఫిబ్రవరిలో జరిగింది. అక్కడ మళ్లీ నేల చదను చేసుకొని, నాట్లు వేసుకోవాలనుకున్నప్పుడు జరిగిన తిరుగుబాటులో లెఫ్టినెంట్ ఆల్మీ మరణించాడు. ఈ గొడవతో ఎస్కిమింజిన్‌కు గానీ, అరావైపాలకు గానీ సంబంధం లేదు. అయినప్పటికీ, తెగ నాయకుడుగనక ముందస్తు చర్యగా అరెస్టు చేశారు అధికారులు.

చివరికి, 1874 జనవరి, 4 నాడు జైలు నుండి తప్పించుకొని నాలుగు నెలల పాటు, గడ్డ కట్టే చలిలో కొండగుహలలో తలదాచుకున్నాడు ఎస్కిమింజిన్. అతనితో పాటు, అనుచరులు కూడా అనూహ్యమైన కష్టాలను భరించక తప్పలేదు. వేట జంతువులు దొరకక పోవడంతో అందరూ ఆకలికి అలమటించారు. ఈ బాధలు చూడలేక సాన్ కార్లోస్‌కు తిరిగి వచ్చిన ఎస్కిమింజిన్, ఏజెంట్ ముందు తన గోడు వెళ్లబోసుకున్నాడు.

"మేమే తప్పు చెయ్యలేదు. మీరు అన్యాయంగా మమల్ని శిక్షిస్తారనే భయంతో పారిపోయాం. కొండల్లో వుంటే మేం ఆకలికీ, చలికీ చస్తాం. ఇక్కడ, బహుశా, అమెరికన్ సైనికులు మమ్మల్ని కాల్చి చంపుతారు. ఏమైనా చావు ఖాయం. ఇక మళ్ళీ పారిపోమని హామీ యిస్తున్నాను".

ఎస్కిమింజిన్, అతని అనుచరుల పునరాగమనం గురించి పై అధికారులకు రిపోర్టు చేశాడు ఏజెంట్. తిరుగు టపాలో ఉత్తర్వులు వచ్చాయి. "అతణ్ణీ, వెంటవున్న వాళ్ళనూ గొలుసులతో బంధించి (యుద్ధ ఖైదీలుగా పరిగణించి) క్యాంప్ గ్రాంట్‌కు

**జెఫోర్డ్ తన మిత్రుడికేసి విచారంగా చూస్తూ తల పంకించాడు. ఫోర్ట్ బావి నుండి జెఫోర్డ్స్ తిరిగి వచ్చే సరికే, కాచైస్ మరణించాడు. వ్యక్తిగత విషాదాలెలావున్నా, ప్రభుత్వం ఆజ్ఞలు అమలు జరపవలసిందే. చిరికా హువాలు ఏజెన్సీ వదిలిపోవాలని ప్రకటించాడు జెఫోర్డ్స్. కాని వెళ్ళటాని కెవరూ సుముఖంగా లేరు. కాచైస్ కుమారులు టాజా, నాయిషె లిద్దరూ ఏమైనా సరే కదలమని మొండికేశారు. జెఫోర్డ్స్ తమ మిత్రుడు. కాచైస్‌కు చేసిన వాగ్దానం కోసమైనా ఈ ప్రతిపాదన విరమించుకోవాలి. 1875 నాటికి అపాచీ తెగలన్నీ రిజర్వేషన్లకే పరిమితమయ్యాయి.**



తరలించాలి".

అరెస్టు చెయ్యబోతుంటే, "నేను చేసిన నేరమేంటి?" అంటూ అడిగాడు ఎస్కిమింజిన్.

కారణమేమిటో ఏజెంట్‌కు కూడా తెలియదు. "ఇది కేవలం ముందు జాగ్రత్త చర్య" అని చెప్పాడు.

బరువైన గొలుసులతో నడవటానికి క్యూడా యిబ్బంది పడ్డాడు ఎస్కిమింజిన్. అయినా, క్యాంప్ గ్రాంట్‌లో, అపాచీలతో ఇటుకలు చేయించారు అధికారులు. కొత్త ఫోర్టు నిర్మాణం ఉన్నది. దానికవి చాలా అవసరం. సైనికులు తినగా మిగిలిన భోజనం మాత్రమే ఖైదీలు తినాలి. గొలుసులతోనే నిద్రపోవాలి.

వేసవికాలం వచ్చింది. కొత్త ఏజెంట్‌గా జాన్ క్లమ్ బాధ్యతలు స్వీకరించాడు. ఎస్కిమింజిన్‌ను చూసి, "ఎందుకు నన్ను బందీ చేశారని" అడిగాడు.

"తెలియదు. తెల్లవాళ్ళు అబద్ధాల కోర్లు. నన్ను అన్యాయంగా అరెస్టు చేశారన్నాడు" ఎస్కిమింజిన్. త్వరలో విడుదల చేస్తానని హామీ యిచ్చాడు క్లమ్.

రెండు నెలల తర్వాత ఎస్కిమింజిన్‌కు విముక్తి లభించింది. అయితే, జీవితం అప్పటికే అతనికి చాలా పాఠాలు నేర్పింది. ఆనాటి స్వేచ్ఛా జీవితం ఇక ఉండదు. తెల్లవాళ్లదే రాజ్యం. అపాచీలకిక గడ్డురోజులే.

1874 వసంతకాలంలో, కాచైస్ తీవ్ర అనారోగ్యంతో మంచం పట్టాడు. చికిత్స కోసం ఆర్మీ సర్జన్‌కు ఫోర్ట్ బావీకి పిలిపించాడు టాం జెఫోర్డ్స్. జబ్బు నిర్ధారణ కాలేదు. మందులు ప్రభావం చూపలేదు. ధృఢమైన కాచైస్ శరీరం రోజు రోజుకూ కృశించింది.

ఈ సమయంలోనే, చిరికాహువా ఏజెన్సీని, హాట్ స్ప్రింగ్స్ ఏజెన్సీతో కలపటం వల్ల కొంత దుబారా ఖర్చు తగ్గించవచ్చునని భావించింది. ప్రభుత్వం దీనికి సంబంధించిన విధి విధానాలు చర్చించటానికి వచ్చిన అధికారులతో మాట్లాడటానికి కూడా ఉత్సాహం చూపలేదు కాచైస్. ఇక, ఏదెట్లాపోతే తనకేం? తనెక్కడికీ కదిలే అవసరమేరాదు. రోజులు లెక్కపెడుతున్న మనిషికి రాజకీయాలెందుకు? కాని, అతని అనుచరులకిది జీవన్మరణ సమస్య. ప్రభుత్వం ఏం చేసినా సరే, తామిక్కడి నుండి కదిలేది లేదన్నారు. హాట్‌స్ప్రింగ్‌కు వెళ్ళటం కన్నా, కొండల్లో చావటం మేలు.

అధికారులు తిరిగి వెళ్ళిన తర్వాత కాచైస్ ఆరోగ్యం మరింత క్షీణించింది. జెఫోర్డ్స్ మరోసారి సర్జన్ కోసం స్వయంగా బయల్దేరాడు.

"ఎందుకు వెళ్ళటం? నువ్వు తిరిగి వచ్చేసరికి నేనుంటానా?" అన్నాడు కాచైస్.

"ఉండకపోవచ్చు"

'రేపు ఉదయం పదింటికి నా ప్రాణం పోతుంది"

జెఫోర్డ్ తన మిత్రుడికేసి విచారంగా చూస్తూ తల పంకించాడు. ఫోర్ట్ బావి నుండి జెఫోర్డ్స్ తిరిగి వచ్చే సరికే, కాచైస్ మరణించాడు. వ్యక్తిగత విషాదాలెలావున్నా, ప్రభుత్వం ఆజ్ఞలు అమలు జరపవలసిందే. చిరికాహువాలు ఏజెన్సీ వదిలిపోవాలని ప్రకటించాడు జెఫోర్డ్స్. కాని వెళ్ళటానికెవరూ సుముఖంగా లేరు. కాచైస్ కుమారులు టాజా, నాయిషె లిద్దరూ ఏమైనా సరే కదలమని మొండికేశారు. జెఫోర్డ్స్ తమ మిత్రుడు. కాచైస్‌కు చేసిన వాగ్దానం కోసమైనా ఈ ప్రతిపాదన విరమించుకోవాలి. 1875 నాటికి అపాచీ తెగలన్నీ రిజర్వేషన్లకే పరిమితమయ్యాయి. కొన్ని మెక్సికో పారిపోయాయి. మార్చి నెలలో జనరల్ క్రూక్‌ను అరిజోనా నుండి ప్లాట్‌కు బదిలీ చేసింది. ప్రభుత్వం అప్పటికే చాలా కాలంగా రిజర్వేషన్లలో మగ్గుతున్న సియో, షెషెనీలలో పెరిగిన అసంతృప్తి కాస్తా తిరుగుబాటుగా మారింది.

అపాచీ నేల మీద బలవంతపు శాంతి రాజ్యమేలింది. ఇండియన్లను, క్రూరజంతువుల్లా కాక, మనుషులుగా గుర్తించిన కొద్దిమంది తెల్ల అధికారులు అతికష్టం మీద ఒడంబడికలను అమలు చేస్తున్నారు. టాం జెఫోర్డ్స్, జాన్‌క్లమ్ లిద్దరూ అపాచీలకు మిత్రులు. కాని, తాము సాధించగలిగింది చాలా తక్కువేనని వాళ్లకు తెలుసు. ఇండియన్లను సమర్థించిన తెల్లవాళ్లకు ప్రభుత్వ ఉద్యోగాల్లో భవిష్యత్తు లేదని ఆ యిద్దరూ అనుభవ పూర్వకంగా గ్రహించారు.

**ఇంకా వుంది....**

మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్

ఫోన్ నెం: 9390044031

# అన్నీ అపజయాలే...



నా మనసు చంచలంగా ఉంటుంది. ఎప్పుడూ విపరీతమైన భయం, ఆందోళన. 25 సంవత్సరాల నా జీవితంలో అన్నీ అపజయాలే. ప్రతి చిన్న విషయానికీ భయం.... ఆందోళన... నేను ఏదైనా ఒక నిర్ణయం తీసుకోలేను. ఒకవేళ తీసుకుంటే అందులోనూ అపజయమే ఎదురవుతోంది. సలహా చెప్పగలరు.

ప్రేమ్, విజయవాడ.

క్షణం క్షణం భయం భయం కలిగించే ఈ ఆందోళనను యాంగ్జయిటీ న్యూరోసిస్ అంటారు. మీరేం చదువుతున్నారో ఏం చేస్తున్నారో తెలియజేయలేదు. నిద్ర సరిగ్గా లేకపోవడం వల్ల భయం, ఆందోళన పెరుగుతాయి. చక్కటి నిద్ర మెదడును విశ్రాంతి పొందేలా చేస్తుంది. నిద్ర పట్టడానికి రిలాక్సేషన్ టెక్నిక్స్, బ్రీదింగ్ ఎక్సర్‌సైజ్ చేయండి. దీని వల్ల మీ సమస్య చాలా వరకూ పరిష్కారం అవుతుంది. చక్కటి సంగీతం వినడం, మంచి బుక్స్ చదవడం, వ్యాయామం చేయడం, పని మీద దృష్టి పెట్టడం చేయండి. మీలో చక్కటి మార్పులు వస్తాయి. మానవ సంబంధాలను చక్కటి అవగాహనతో, సమర్థవంతంగా నిర్వహించండి. అప్పుడు అద్భుతమైన విజయం కైవసం కావడమే కాక అందరి హృదయాలను గెలుచుకోగలిగే అపురూపమైన సామర్థ్యం మీకు ఏర్పడుతుంది. అవసరమైతే కౌన్సిలింగ్ సైకాలజిస్ట్‌ని కలవండి.

# ఎలా చెప్పాలి?



నా వయస్సు 22 సంవత్సరాలు. నేను ఒక వ్యక్తిని ప్రేమిస్తున్నాను. కాని అతనికి ఎలా చెప్పాలో నాకు తెలియడం లేదు. సలహా ఇవ్వగలరు.

కమల, ఖమ్మం.

ప్రేమించడం చాలా ఈజీ, ప్రేమను అర్థం చేసుకోవడం చాలా కష్టం. ముందు మీ ఇద్దరి మధ్యన చక్కటి అవగాహన ఉండాలి. అసలు మీరు అతని గురించి ఏం తెలుసుకున్నారో పరిశీలించండి. పరస్పరం మానసిక, వ్యక్తిగత, ఉద్యోగ అవసరాలను ఒకరికి ఒకరు చెప్పకోవాలి. ఒకరి భావాలు మరొకరికి తెలుపుకునే సందర్భాలలో జాగ్రత్తగా ఆసక్తిగా వినాలి. మీరు అతనిని సహించడం, భరించడం ఎంత వరకూ ఉందో పరిశీలించండి. ప్రేమ కోసం మీ అభిరుచులను అభిప్రాయాలను ఎంత వరకూ సడలింపు చేసుకోగలరో మీ మధ్య స్పష్టమైన అవగాహన ఉండాలి. ప్రేమలో నేర్పు, సహనం చాలా అవసరం. అలాగే అవతలివారి పరిస్థితులు, బలహీనతలు, లోపాలు తెలుసుకోవాలి. వారి కుటుంబ వ్యక్తుల గురించి, సంస్కృతి గురించి తెలుసుకోండి. ఇవన్నీ ఓకే అయినప్పుడు అతనికి మీ ప్రేమను తెలియజేయండి. అతను కాదన్నా సరే గౌరవంగా తప్పకోవాలి. అదే నిజమైన ప్రేమ అనిపిస్తుంది.

# సమస్య తీరేదెలా!



మా నాన్నగారు చాలా మంచివారు. ఏ చెడ్డ అలవాట్లూ లేవు. కాని ఒక సంవత్సరం నుండి ఏజెన్సీలో దొరికే కల్లు తాగుతున్నారు. దానితో వాంతులు, అనారోగ్యం. మా నాన్నను చూసి అమ్మ తిడుతుంది. దానికి మా నాన్న గారు చేయి చేసుకున్నారు. మా అమ్మకి అసలే కోపం ఎక్కువ. ఇలా జరిగిన ప్రతిసారీ 'నేను ఆత్మహత్య చేసుకుంటాను, అప్పుడు తెలుస్తుంది' అంటుంది. కాని నా గురించి... మా తమ్ముళ్ల గురించి ఆలోచిస్తుంది. మళ్లీ ఇటువంటి సంఘటన జరిగితే అమ్మ నిజంగా ఆత్మహత్యకు పాల్పడుతుందేమోనని భయంగా ఉంది. నాన్నను గట్టిగా మందలించి కొట్టాలనేంత కోపం వస్తోంది. కానీ అలా చేయలేను. నేను హాస్టల్లో ఉండి ఇంటర్ చదువుతున్నాను. ఈ సంఘటన జరిగినప్పటి నుండి చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నాను. మా కుటుంబానికి ఈ సమస్య తీరే మంచి సలహా ఇవ్వగలరు?

మూర్తి, సరూర్‌నగర్.

మీ అమ్మగారు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడం మంచి పద్ధతికాదు. మీ నాన్నగారు చాలా మంచి వారని చెబుతున్నారు. మీ అమ్మగారు, మీరు మంచిగా చెడు అలవాటు గురించి, దాని వల్ల ఇంట్లో అందరూ ఎన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారో, ఎంత నరక యాతనకు గురవుతున్నారో వివరంగా తెలియజేయండి. సమాజంలో ఇంత కాలం మంచిగా ఉన్నవాళ్లం ఇప్పుడు అందరూ చెడుగా చూస్తున్నారని, బయట తలెత్తుకోలేకపోతున్నామని చెప్పండి. ఈ అలవాటు మానుకోవడం వల్ల మీ అంత మంచివారు ఈ సమాజంలో మరెవరూ ఉండరని చెప్పండి. మీ నాన్నగారికి నచ్చజెప్పి రాజమండ్రిలోని సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళ్లండి. ఆయన చక్కగా మారతారు. సమస్యలనేవి ప్రతి ఇంటిలోనూ ఉంటాయి. సమస్యకు పరిష్కారం ఆలోచించాలి. మీ దృష్టి అంతా చదువు మీద పెట్టండి. మీరు బాగా చదువుకొని గొప్ప వ్యక్తి అయితే మీ తమ్ముళ్ళు కూడా మరింత గొప్ప వ్యక్తులుగా మారతారు. ఆల్ ది బెస్ట్.

చందు



పాటకు ప్రాణం పల్లవైతే అందెశ్రీ పాటకు పల్లవి... ఆయన పుట్టిన పల్లెటూరు. 'తల్లీ నీకు వందనాలమ్మా... నను గన్నా పల్లే... తల్లీ నీకు వందనాలమ్మా... నాకు పాట నేర్పి... మాట నేర్పి... బతుకు బాట చూపినందుకు...తల్లీ నీకు వందనాలమ్మా...' అంటూ తాను బతికినంత కాలం పల్లెకు విధేయుడిగా ఉంటానంటారు. బాలారిష్టాలు దాటి, పుట్టెడు కష్టాల నుంచి ఒడ్డున పడ్డా... కష్టాలే మార్గాన్ని నిర్దేశిస్తాయంటారు. 'మళ్ళీ జన్మంటూ ఉంటే... నీ కడుపున పుడతా సూరమ్మో...' అని అమ్మతనపు ఆనవాళ్ళకు రుణం తీర్చుకున్నారు. పాలకుల బుద్ధులు మారితే 'ఆదర్శ సమాజం' సునాయాసంగా వస్తుందన్న ఆశాభావంతో ఉన్న ప్రజా కవి అందెశ్రీ అనుభవాల మాలిక...

# నా పాటకు తల్లి వేరు మా ఊరు

**నా**కూ, నా పాటకూ ప్రాథమిక పాఠశాల మా ఊరు రేబర్తి (వరంగల్ జిల్లా). తల్లిదండ్రులు పెట్టిన పేరు 'అందె ఎల్లయ్య'. కాలగమనంలో 'అందె ఎల్లయ్య' అంతరించిపోయాడు. గౌరవ సూచికంగా ఉండే 'శ్రీ' పదాన్ని ఇంటి పేరుకు జత చేసి 'అందెశ్రీ' అయ్యాను. చినుకుగా పుట్టిన పాట ఇవ్వాళ్టి లోకంలో సముద్రంలా అలరారుతోంది. అందులో నేనొక అణువంత నీటి చుక్కను. నేను పుట్టిన పరిసర ప్రాంతాలు నాలో పాటను పుట్టించాయి. యక్షగానాలు, శారదగాళ్ళు, బాలసంతులు, బుడబుక్కలు, గంగిరెద్దులు, కోలాటాలు, చిడతాటలు, పౌరాణిక గాథలు, ఆశ్రిత కులాల కళల ప్రభావం అందరితో పాటు నాపై కూడా పడింది. ఎన్ని శాస్త్రీయాలొచ్చినా... మా నుంచే రాగాలు పుట్టాయని దండోరా వేసుకుని ప్రకటించుకున్నా... వీటన్నింటి కుదురు పల్లె. నా పాట పురుడు పోసుకోవడానికి పెద్ద పాదు పల్లె అయింది. నా పాట పుట్టుకకు మొదటి తల్లి వేరు నా ఊరు. నన్ను ప్రభావితం చేసిన నేపథ్యం, చుట్టొచ్చిన ప్రాంతాలు, కష్టనష్టాలు, గిచ్చుళ్ళు, నొచ్చుళ్ళు, సవాలక్ష సంకోచాలు... నా పాటకు హేతువయ్యాయి. అయితే... 'కష్టాలే కవిత్వానికి హేతువులు' అని చాలామంది అంటుంటారు. అలాగైతే నూటికి 80 మంది కష్టాలు పడుతున్న వాళ్ళే. వారంతా కవులైపోవాలి. కన్నీళ్ళొచ్చిన వాళ్ళంతా కళాకారులై వర్ధిల్లాలి కదా! అసలు ఈ ప్రపంచానికి పాటబిచ్చం పెట్టింది స్త్రీయే. ఈ ప్రకృతి మొత్తం స్త్రీయే కదా... నేల మీద ఉత్పత్తి కూడా స్త్రీయే ... ఉత్పత్తికి ఆది భూతమైన స్త్రీ అమ్మ కాబట్టి ఆ అమ్మతనపు ఆత్మ పాటగా ఈ ప్రపంచాన వర్ధిల్లుతోంది.

**నన్ను అమ్మలా లాలించి, పాలించిందీ పాట**

అనామకుడిగా పుట్టిన నన్ను అందరివాణ్ణి చేసిందీ పాట. అడ్రస్ లేని నాకు చిరునామా అయిందీ పాట. ఆకలితో అల్లాడుతున్న నన్ను అక్కున చేర్చుకుని అమ్మలా లాలించి, పాలించిందీ పాట. నాకు పాట నేర్పి, మాట నేర్పి, బతుకు బాట చూపిన పల్లెకు, ప్రజలకు బతికినన్ని కాలాలూ విధేయుడిగా ఉంటాను.

**'చెట్టు పుట్టా... చేనూ చిలకా... కంచెలన్నీ కలచుట్టీ రాగా...**
**కాళ్ళ నిండా రేగూ ముండ్లు... కళ్ళ నిండా గమ్మెదు నీళ్ళు...**
**అలమందల దొడ్లో తోలి... అంబటాళ్ళకు ఇంటికెళితే...**
**కూడూ వండకపోదోరింటా... కడుపులో ఆ కాలే మంట...**
**ఆకలితో అలుమటించే నన్ను, నీ అక్కునా చేర్చుకుందువమ్మా...**
**పల్లె నీకు వందనాలమ్మా... నను గన్నా తల్లీ నీకు వందనాలమ్మా**
**నాకు పాట నేర్పి... మాట నేర్పి...**
**బతుకు బాట చూపినందుకు...**
**పల్లె నీకు వందనాలమ్మా...'**

నా బాల్యపు కష్టాలన్నింటినీ ఈ పాటగా మలిచాను. నేనొక్కడినే కొత్తగా పడ్డ కష్టాలు కావు. పుట్టిన దగ్గర్నుంచీ గిట్టే దాకా నిరంతర సంఘర్షణ యాత్రే కదా మనిషిది. ఇలాంటి జీవన యాత్రలో నేనేమీ మినహాయింపు కాదు.

**'బౌద్ధం' చదువు మీద శ్రద్ధ కలిగించింది**

చెట్టు కింద పిట్టలు రెట్టేసిన విధంగా నా రాత ఉంటుంది. నాకు మాత్రమే అర్థమయ్యేటట్లు అల్లిబిల్లి పిచ్చి రాతలా ఉంటుంది. బడికెళ్ళకపోయినా... చదవడం నేర్చుకున్నాను. చదువుకుందామనుకుని ఐదేళ్ళ వయసులో 10 మంది పిల్లలతో కలిసి పలకా బలపం పట్టుకుని స్కూలుకి బయలుదేరాను. దారిలో ఓ మాస్టారు కనిపించి, స్కూల్లో కోదండమేయించి(గోడకుర్చీ) కొడతారని చెప్పగానే, బడిలో అడుగు పెట్టకుండానే ఇంటికి తిరుగు ముఖం పట్టాను. నాకు చదువు మీద ఆసక్తి, శ్రద్ధ కలిగించింది బౌద్ధం. అంత చిన్న వయసులో బౌద్ధం గురించి మీకేమి తెలుసని అడగొచ్చు. వాస్తవానికి అప్పుడది బౌద్ధమని కూడా తెలీదు. ఓసారి దేవదత్తుని కథ విన్నాను. దేవదత్తుడు హంసను గాయపరుస్తాడు. సిద్ధార్థుడు దాన్ని చేరదీసి గాయానికి మందు రాస్తాడు. 'నేను రాజును. ఆ పక్షిని వేటాడాను కాబట్టి, అది నాది' అని దేవదత్తుడు... 'హంసకు నేను ప్రాణం పోశాను. ఇది నీదెలా అవుద్ది' అని సిద్ధార్థుడు... ఈ సంఘటన రాజదర్బార్ వరకూ వెళుతుంది. ఈ విషయం అక్కడ కూడా తలనొప్పిగా మారుతుంది. సిద్ధార్థుడు, దేవదత్తుణ్ణి చెరో కుర్చీలో కూర్చోబెట్టి, హంస తన ఇష్టానుసారం ఎవరి దగ్గరకు వెళితే, వాళ్ళకే అది చెందుతుందని ఓ సృజనపరుడు సలహా ఇస్తాడు. హంస బుద్ధుని ఒళ్ళో వచ్చి కూర్చుంటుంది. ఆ సమయంలో సిద్ధార్థుడు మాట్లాడుతూ... 'వేటాడే ధర్మం రాజుకుందని మీరంటున్నారు కదా! ప్రాణం పోసే శక్తి మీకు లేనప్పుడు తీసే హక్కు ఎవరిచ్చారు?' అని ప్రశ్నిస్తాడు. ఈ కథ విన్నాక, ఇంత గొప్ప కథలుంటాయా? అనిపించింది. చదువుకుంటే బోలెడన్ని మంచి కథల గురించి తెలుసుకోవచ్చని పించింది. దీంతో చదువు మీద మక్కువ కలిగింది.

మూడు, నాలుగు తరగతులు చదివే పిల్లలు శని, ఆదివారాల్లో నాతో పాటు పశువులు కాయడానికి వచ్చేవాళ్ళు. చదువు నేర్పమని వాళ్ళని అడిగేవాణ్ణి. ఒక షరతు పెట్టి, అందుకంగీకారమైతేనే నేర్పుతామనేవాళ్ళు. రోజంతా వాళ్ళ పశువులను నేను కాయాలి. చదువు పట్ల ఉన్న ఆసక్తి కొద్దీ సరేననేవాణ్ణి. రోజంతా గొడ్లు కాయించుకుని చెప్పీచెప్పక రెండక్షరాలు నేర్పించే వాళ్ళు. అ,ఆ నుంచి అం, అః వరకు నేర్చుకోవ డానికి రెండేళ్ళు పట్టింది.

మునీర్ సేట్ దగ్గర జీతానికున్నప్పుడు తెలుగక్షరాలు సంపూర్ణంగా నేర్చుకున్నాను. 14 సంవత్సరాలప్రాయంలో 75 పైసలు ఖర్చు పెట్టి 'అరటి బాలశిక్ష' కొనడానికి వారం రోజులు కష్టపడ్డాను. చివరికా పుస్తకం కొని, రోడ్డు మీద ఎవరు కనబడితే వాళ్ళని అందులోని లెక్కలడిగేవాణ్ణి. ఇదే పద్ధతిలో 'క'కు దీర్ఘమిస్తే ఏమంటారు? 'క'కు గుడిస్తే ఏమవుతుందో అడిగి తెలుసుకున్నాను.

**ఇంకా వుంది....**

# ఏ ముక్క సరిపోతుందో

టింకూ గాడు కప్పు పగలకొట్టాడు. ముక్కలన్నీ చెల్లా చెదరుగా పడిపోయాయి. ఇంతకీ ప్రశ్న గుర్తు వున్న చోట కింది మూడింటిలో ఏ ముక్క సరిగ్గా సరిపోతుందో చెప్పుకోండి.




(జవాబు: C)




# ఎన్ని రాయగలరు?

నేస్తాలూ! ఇక్కడ కొన్ని అక్షరాలున్నాయి కదా. వాటితో మీరు ఎన్ని మూడక్షరాల ఆంగ్ల పదాలను రాయగలరో ప్రయత్నించండి. ఆ...మీరు రాయడం అయ్యాక మా సమాధానం చూడండే.

Answer: HAT, HOT, TAP, PAT, , TOP, POT, HOP




# గ్రీటింగ్ కార్డ్ చేసేద్దాం

1. కొన్ని పూలు, ఆకులు సేకరించండి.
2. వాటిని న్యూస్ పేపర్ లోపల పెట్టండి.
3. దాని మీద లావుపాటి పుస్తకాలు వుంచండి.
4. వారం రోజుల తర్వాత వాటిని తీసి ఒక చార్టు ముక్క మీద అతికించండి. అంతే గ్రీటింగ్ కార్డ్ రెడీ. మీకు ఐడియాలు రావడం కోసం కొన్ని గ్రీటింగ్ కార్డులు ఇచ్చాం. చూసి మీరు ఇంతకంటే మంచి గ్రీటింగ్ తయారు చేయండి. వీటిని మీ నేస్తాలకు సంక్రాంతి శుభాకాంక్షలు చెపుతూ ఇవ్వండి. వాళ్లు ఎంతగానో సంతోషిస్తారు. ఓకేనా. మరి ఆలస్యం ఎందుకంట. పూలు, ఆకులు ఎక్కడున్నాయో వెతకండీ...





# మేం చెప్పిన రంగులద్దండే...

1-చాక్లెట్, 2-గోధుమ రంగు, 3-ఆకుపచ్చ,
4-ఎరుపు, 5-నీలం, 6-పసుపుపచ్చ.

# పది తేడాలు ఎక్కడున్నాయబ్బా!







# మొత్తం ఎన్ని సున్నాలున్నాయోచ్!

# మీకు తెల్సా!



**ఏ**నుగు దంతాలు తొమ్మిది పౌండ్లకంటే ఎక్కువ బరువును మోయగలవు.



**కి**వీస్ పక్షులు మాత్రమే వాసన చూసి తమ ఆహారాన్ని వేటాడతాయి.

**హం**స శరీరం మీద పాతిక వేలకు పైగా ఈకలుంటాయి.

అద్భుతాల కథ

కాకర్లమూడి విజయ్

జనాభా అవసరాలను తీర్చడం ప్రభుత్వాలకు కత్తిమీద సాములాంటిది. ఆ క్రమంలో సాంకేతిక పరిజ్ఞానం అనూహ్య రీతిలో అద్భుతాలను ఆవిష్కరించడం మనకి తెలుసు. నదీ జలాలను ప్రజోపయోగాలకు వినియోగించడానికి ఆనకట్టలు, భూగర్భం నుండి చమురును తీయడానికి, భారీ పరికరాలు, ఆవాసానికి అనుగుణంగా అకాశ హార్మ్యాలూ... ఏ కోణం నుండి చూసినా ప్రజా ప్రయోజనాలకు సాంకేతిక యోజనలు అమోఘం. అటువంటి కీలక ప్రజాహితమైన కార్యక్రమాలలో ప్రజా రవాణా ఒకటి. ఉపరితల రవాణా, వాయురవాణా ప్రక్రియల్లో సాటిలేని అద్భుతాలు ఎన్నో ఇప్పటికే జరిగాయి. అటువంటి అద్భుతాల్లో ఒకటి దాదాపు నూట నలభై అయిదు సంవత్సరాల క్రితం జరిగింది. అదే లండన్ భూగర్భ రైలు మార్గం.

# భూగర్భ రైళ్లు ... భలే.. భలే..

ఈ లండన్ భూగర్భ రైలు మార్గం అతి పురాతనమైనది. అతి పొడవైన భూగర్భ మార్గాలలో ఇది ఒకటి. పేరుకి భూగర్భ రైల్వే అయినా ఇది సగానికి పైగా భూమి ఉపరితలం పైనే ఉండటం విశేషం. నాలుగు వందల ఎనిమిది కిలోమీటర్ల దూరంతో 275 స్టేషన్లు ఉన్న ఈ సుదీర్ఘ భూగర్భ రైలు మార్గం 1863, జనవరి 10న అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఈ మార్గాన్ని 30,00,000 కంటే ఎక్కువ మంది ప్రతి రోజూ వినియోగిస్తున్నారు. అదే వారాంతాల్లో అయితే దాదాపు మూడున్నర మిలియన్ల ప్రయాణీకులు ఉంటారు.

లండన్ భూగర్భరైలు మార్గాన్ని 'ట్యూబ్' అని పిలుచుకుంటారు. ట్యూబ్‌ల వంటి ప్లాట్‌ఫారాలు, సొరంగాలు ఉండటం వల్ల ఆ పేరు వచ్చింది. కానీ వేగంగా, అధిక సంఖ్యలో ప్రయాణీకులను తమ తమ గమ్యాలకు చేరవేసే ప్రయాణ సౌకర్యం పట్టణాలలో అవసరమని గమనించి, వాటిని అమలు పరిచిన వ్యవస్థను సాధారణంగా మెట్రో (మెట్రో పాలిటిన్) రైలు వ్యవస్థ అంటారు. అమెరికా, జపాన్ వంటి దేశాలలో దీనిని 'సబ్ వే' అంటారు.

లండన్ ట్యూబ్ నిర్మాణం పది సంవత్సరాల చర్చల అనంతరం, 1860లో ప్రారంభమైంది. కేవలం మూడేళ్లలోనే పూర్తి చేయడం విశేషం. ఈ మార్గంలో 1905 వరకూ ఆవిరితో నడిచే బొగ్గు ఇంజన్లు వాడుకలోకి వచ్చాయి. ఈ అతి ప్రాచీన భూగర్భ రైలు తొలి ప్రయాణంలో 41,000 ప్రయాణీకులు ప్రయాణించారు. ప్రతి పది నిమిషాలకు ఒక రైలు నడిచింది. అదే 1880కల్లా ఏటా 4,00,00,000 మంది ప్రయాణించారు. ఈ రైళ్లు 24 గంటలూ నడుస్తూ ఉండవు. కొత్త సంవత్సరం రోజున, ఇతర ముఖ్య ప్రజా కార్యక్రమాల సందర్భంగా తప్పితే అవి ఉదయం 4.30 ప్రారంభమై రాత్రి 1.30 వరకూ సేవలందిస్తూ ఉంటాయి. మిగతా సమయంలో వాటికి చిన్న చిన్న రిపేర్లు చేయటానికి వీలుగా ఆపేస్తారు.

### మూడు రకాలుగా నిర్మిస్తారు

'అసలు భూగర్భ రైలు మార్గాలను ఎలా నిర్మిస్తారు?' అన్న అనుమానం వస్తుంది ఎవరికైనా! భూగర్భ రైల్వేలు జనసమ్మర్ధం ఎక్కువగా ఉన్న నగరాలలో బాగా ఉపయోగ కరంగా ఉంటాయి. ఎటువంటి ఆటంకాలు లేకుండా గమ్యస్థానం చేరడానికి ఈ భూగర్భ రైళ్లు తోడ్పడతాయి. కానీ వాటి మార్గ నిర్మాణ సమయంలోనే ఎన్నో ఆటంకాలను ఎదుర్కోవలసి ఉంటుంది.

సాధారణంగా భూగర్భ రైలు మార్గాల నిర్మాణంలో మూడు పద్ధతులున్నాయి. ఒకటి ఓపెన్ కట్. భారీ కాలువలు తవ్వి, వాటిలో రైలు



పట్టాలు పరచడం ఈ పద్ధతి.

కొన్నిసార్లు అలా తవ్విన కాలువలపైన రోడ్డు గానీ, పేవ్‌మెంటుగానీ కప్పులాగా పరిచేస్తారు. ఇది రెండవ పద్ధతి. దీన్ని కట్ ఎండ్ కవర్ పద్ధతి అంటారు.

మూడవ పద్ధతిలో నేలని తొలచి, సొరంగాలు చేయడం. నేలపైన ఉన్న ట్రాఫిక్ గానీ, నిర్మాణాలకు గానీ ఎటువంటి ఇబ్బంది కలిగించకుండా ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. సాధారణంగా మొదటి రెండు పద్ధతులలో నిర్మించిన మార్గాలు దీర్ఘ చతురస్రాకారంలో ఉంటాయి. చివరి పద్ధతిలోవి గుండ్రంగానూ, అర్ధ చంద్రాకారంగానూ ఉంటాయి. లండన్ భూగర్భ మార్గం చాలా మటుకు అర్ధచంద్రాకారంగా ఉంటుంది. న్యూయార్క్‌లో భూగర్భమార్గం దీర్ఘచతురస్రంగా ఉంటుంది.

భూగర్భరైలు మార్గాలలో అతి కీలకమైన అంశం వెంటిలేషన్. సొరంగాలలో నిలబడిపోయే గాలిని బయటికి పంపడానికీ, తాజా గాలిని లోపలికి తీసుకురావడానికి ఫ్యాన్లు ఉపయోగిస్తారు.

**ఎక్కడ...ఎప్పుడు...**

లండన్ నగరంలో నిర్మించిన 'ట్యూబ్' తరువాత యూరప్‌లో చాలా నగరాలు భూగర్భ రైలు మార్గాలు నిర్మించాయి. పారిస్ మెట్రో 1900లో ప్రారంభమైంది. దాంట్లో కొన్ని రైళ్లకు గాలి నింపిన రబ్బరు టైర్లుంటాయి!

అమెరికాలోని భూగర్భ రైలు మార్గాలను 'సబ్‌వే'లు అంటారు. బాస్టన్ సబ్‌వే అమెరికాలోని మొట్టమొదటిది. అది 1897లో ప్రారంభమైంది. దక్షిణ అమెరికాలో 1913లో ఒక సబ్‌వే నిర్మించారు.

ఆస్ట్రేలియాలోని సిడ్నీ సబ్‌వే 1926 లోనూ, మెల్‌బోర్న్‌లో 1984లోనూ ప్రారంభమైనాయి. సింగపూర్‌లో మొదటి భూగర్భ రైలు మార్గం 1989లో కాగా, జపాన్‌లో చాలా ముందే 1927లో ప్రారంభమైంది. మన దేశంలో కలకత్తాలో మొదటి మెట్రో ప్రారంభమైంది. అది 1984లో. ఆఫ్రికాలో తొలి మెట్రో కైరో మెట్రో. అది 1987లో మొదలైంది.

**భూమి లోపలే ఎందుకు?**

పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకొని ర్యాపిడ్ ట్రాన్సిట్ ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థను స్థాపించడం జరిగింది. ఈ వ్యవస్థలో భాగంగా ఒక నగరంలోని అన్ని ప్రాంతాలకూ, లేదా కొన్ని ప్రాంతాలకు భూతలం లేదా భూగర్భ రవాణా సౌకర్యాలతో లేదా రెండిటితో ప్రజలను చేరవేయడం జరుగుతుంది.

ఈ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్‌లను మాస్ ట్రాన్సిట్ సిస్టమ్‌లని కూడా అంటారు. ఒకే రైలులో ఎక్కువ సంఖ్యలో ప్రయాణీకులను చేరవేయడం దీని ఉద్దేశ్యం.



కొన్ని సబ్‌వే/ మెట్రో/ ట్యూబ్‌లు ఒకే లైన్‌తో నడుస్తుండగా కొన్ని మాత్రం నెట్‌వర్క్‌గా ఉన్నాయి. అత్యంత పొడవైన భూగర్భ మార్గం బెర్లిన్‌లోని 477కి.మీ. మార్గం. రెండవది ఆస్ట్రియాలోని వియన్నాలోది - 448కి.మీ. లండన్ ట్యూబ్ అతి పెద్దది కాగా(408 కి.మీ) మాస్కోలోని భూగర్భరైలు ఎక్కువ మంది ప్రయాణీకులను తీసుకువెళ్లేది (ఏటా దాదాపు 3.5 బిలియన్ల ప్రయాణీకులు). న్యూయార్క్‌లోని సబ్‌వే 393 కిమీ పొడవు, 463 స్టేషన్లు ఉన్నాయి. ఇన్ని స్టేషన్లున్న సబ్‌వే ప్రపంచంలో బహుశా న్యూయార్కే కావచ్చు. ఇది ఏటా 1.5 బిలియన్ల ప్రయాణీకులను మోస్తోంది.

సాధారణంగా భూగర్భ సొరంగాలు 10 అడుగుల లోతులో ఉంటాయి. కానీ మాస్కోలోవి మాత్రం 20 అడుగులు వరకూ ఉన్నాయి. పేరొందిన రష్యన్ కళాకారులు పాలరాతితో ఈ సొరంగ స్టేషన్లకు సొగసులద్దారు.

లండన్ భూగర్భ వ్యవస్థలో నాలుగు పట్టాలుంటాయి. రెండు పట్టాలపై చక్రాలుండగా మిగతా రెండూ విద్యుత్‌కి ఉపయోగపడతాయి.

**ప్రమాదాలూ పొంచివుంటాయ్**

చాలా వ్యవస్థల్లాగే భూగర్భ రైల్వే వ్యవస్థకి కూడా ప్రమాదాల ప్రమాదం లేకపోలేదు. లండన్ ట్యూబ్ అందుకు అతీతం కాదు. ఆత్మహత్యలు, ప్రమాదాలు, టెర్రరిజం... ఇలా ఎన్నో సమస్యలను ఎదుర్కొంది. ఎదుర్కొంటూనే ఉంది.

ఈ అండర్ గ్రౌండ్‌లో 1885లో ఒక బాంబు పేలింది. తాజాగా 2005 జూలై 21న కూడా బాంబులు పేలాయి. 2005 జూలై7న మానవబాంబులు మూడు రైళ్లలో తమని తాము పేల్చుకున్నారు.

ఈ టన్నెళ్లలో గాలి నాణ్యత చాలా అవసరం. అది కలుషితం కాకుండా చూడడం ముఖ్యం. అయితే 1984 జూలై వరకూ కొన్ని బోగీలలో పొగతాగడం అనుమతించేవారు. కానీ 1987 నవంబరు నుండి సంపూర్ణంగా నిషేధించారు.

అయినప్పటికీ.... శతాబ్దానికి పైగా భూగర్భంలో ప్రతి రోజూ లక్షలాది ప్రయాణీకుల్ని గమ్యస్థానాలకు చేర్చుతున్న లండన్ ట్యూబ్‌లో ప్రమాదాల సంఖ్య చాలా తక్కువ కావడం విశేషం.

### పలు ప్రాంతాల్లో భూగర్భ రైలు మార్గాలు

ఆఫ్రికా ఖండం

ఈజిప్ట్ (కైరో) 1987 సంవత్సరంలో - 62.5 కిమీ

ఆసియా ఖండం

చైనా

బీజింగ్- 1969 -142 కి.మీ , హాంగ్‌కాంగ్-1979 -175.4 కిమీ, టియాంజిన్-1984 -26.2 కిమీ, షాంఘై-1995 -228.4 కిమీ, గ్వాంగ్‌జూ -1999-116 కిమీ, షెన్‌జెన్-2004 -21.9 కిమీ, వుహాన్ - 2004 -10.2 కిమీ, ఛాంగ్‌కింగ్ - 2005 -19.2 కిమీ, నాంజింగ్ -2005 -13 కిమీ, భారతదేశం , కోల్‌కతా -1 984 - 16.5 కిమీ, హైదరాబాద్ - 2003 - 26 కిమీ , ఢిల్లీ - 2002 -65.1 కిమీ

జపాన్‌లో 11, ఇరాన్, ఇజ్రాయెల్, మలేషియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, ఉత్తర కొరియా, తైవాన్, థాయ్‌లాండ్, ఉజ్బెకిస్తాన్‌లో ఒక్కొక్కటి ఉన్నాయి. యూరప్‌లో 60కి పైగా మెట్రో వ్యవస్థలు ఉన్నాయి. దక్షిణ అమెరికాలో 16 మెట్రో వ్యవస్థలు ఉన్నాయి. ఉత్తర అమెరికాలో 7, అమెరికాలో సంయుక్త రాష్ట్రాలలో 14 ఉన్నాయి.

అతి చిన్న మార్గం ఆస్ట్రియాలోనే డోర్ఫాన్ సెర్ఫాస్‌లోని 1.3 కి.మీ మార్గం.

## రాజధానిలో మెట్రో

ఢిల్లీలోని మెట్రో రైలు వ్యవస్థ దేశంలోని రెండవ భూగర్భ రైలు మార్గం. దీనిని డిసెంబర్ 24, 2002లో ప్రారంభించారు. ఈ మార్గంలో ఇప్పటికి మూడు లైన్లు, 5 స్టేషన్లు (13 భూగర్భ స్టేషన్లు) ఉన్నాయి. దీని దూరం 65.కీ.మీ. అయితే ఇది ఫేజ్ 1లో భాగం. ఫేజ్ 2లో మొత్తం దూరం 121. కీ.మీ. 79 స్టేషన్లు ఉంటాయి. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఈ రెండవ దశ మరో మూడేళ్లకి అందుబాటులోకి వస్తుంది.

అటువంటి అవాంఛనీయ సంఘటనలు నివారించేందుకు తీసుకున్న చర్యలు, ప్రతి దినం మెయింటెనెన్స్ సిబ్బంది పడే శ్రమ, సాంకేతిక పరిజ్ఞానం, వాడకం ప్రయాణీకులకు అలసట తెలీకుండా చేస్తున్నాయి.

ఇరవయ్యో శతాబ్దంలో ప్రవేశపెట్టిన హైదరాబాద్ మెట్రో (ఉపరితల రైలు) మాత్రం అడపాదడపా మనుషులకూ, పశువులకూ ప్రాణాంతకంగానే ఉంది. అందుకు కారణం మెట్రోది కాకపోయినా, ప్రమాదం ప్రమాదమే.

నిత్యం అపరిమితంగా పెరుగుతున్న నగరజనాభా, కుంచించుకుపోతున్న వనరులు ప్రతి విషయంపై తీవ్ర వత్తిడిని పెంచుతూనే ఉన్నాయి. అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు, సాంకేతిక నైపుణ్యం సిద్ధంగానే ఉన్నా మరెన్నో ఆటంకాలూ సిద్ధంగానే ఉన్నాయి. ప్రత్యేకించి హైదరాబాద్, ముంబాయి, బెంగుళూరు వంటి నగరాలలో అత్యవసరమైన మెట్రో వ్యవస్థకి ఎదురయ్యే అడ్డంకులు ఎన్నో.

అటువంటి ఆటుపోట్లని తప్పించుకుని, ప్రయాణీకుల పాట్లను తీర్చే వ్యవస్థ రావడం అత్యవసరం. అందుకు లండన్ ట్యూబే స్ఫూర్తి.

### మన తొలి మెట్రో

పెద్ద నగరాల ప్రజారవాణా కోసం భూగర్భరైలు వ్యవస్థ చాలా ప్రయోజనకారిగా ఉండే వ్యవస్థ. లండన్‌లోని ట్యూబ్ ప్రపంచంలో మొదటి భూగర్భ రైలు మార్గమైతే, మన దేశంలోని కోల్‌కతా లోని 'మెట్రో' ప్రపంచంలోని 85వ భూగర్భ మార్గం. భారతదేశంలో మొదటిది. ఆసియాలో 5వది. ఈ మెట్రో 1984, అక్టోబరులో ప్రారంభమైంది. అక్టోబరు 24, 1984న కోల్‌కతా మెట్రో పాక్షికంగా ప్రారంభమైంది. తొలి సారిగా



3.40కిమీ దూరాన్నే వినియోగంలోకి తెచ్చారు. సెప్టెంబర్ 27, 1995 కల్లా మొత్తం మెట్రోని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చారు. మొదటి సంవత్సరంలో దాదాపు పధ్నాలుగ్గుర లక్షల ప్రయాణీకులు దీనిని వినియోగించుకోగా, పదవ సంవత్సరంలో (1994-95) 194.85 లక్షల మంది ప్రయాణించారు. అలాగే 1998-99లో 580.22 లక్షల మంది దీనిని ఉపయోగించారు.

కోల్‌కతా మెట్రో మొత్తం పొడవు 16.45 కీ.మీ. ఇది డమ్‌డమ్ ఉండి టాలీగంజ్ వరకూ ఉంటుంది. ఈ మార్గంలో మొత్తం 17 స్టేషన్లున్నాయి. వాటిలో 15 భూగర్భంలో ఉన్నాయి. ఈ మార్గంలో రైళ్లు గంటకు 55 కిమీ గరిష్ట వేగంతో ప్రయాణిస్తాయి. మొత్తం దూరాన్ని (16.45 కి.మీ) ఇది 33 నిమిషాల్లో ప్రయాణిస్తాయి. పది నిమిషాలకొక రైలు ప్రయాణించే ఈ మెట్రో మార్గాన్ని నిర్మించేందుకు 23 ఏళ్లు (1972-1995), రూ. 1706 కోట్లు ఖర్చయ్యాయి. ఈ మార్గాన్ని 1999లో టాలీగంజ్ నుండి గారియా వరకూ పొడిగించారు. ఈ పొడిగించిన మార్గం 8.45 కి.మీ.

### ఎం.ఎం.టి.ఎస్

హైదరాబాద్ నగరానికి ప్రత్యేకంగా జన సమ్మర్ధంగా ఉండే ప్రాంతాల మధ్య వేగంగా ప్రయాణించ దానికి ఎం.ఎం.టి.ఎస్ ప్రవేశపెట్టారు. ఆగస్టు 9, 2003న ప్రారంభమైన మల్టీ మోడల్ ట్రాన్సిట్ సిస్టమ్‌లో ప్రస్తుతం రోజుకు దాదాపు 84 సర్వీసులున్నాయి. సికింద్రాబాద్, లింగంపల్లి, ఫలక్‌నుమాలను కలుపుతూ 27 స్టేషన్ల మధ్య ఈ సర్వీసులు నడుస్తున్నాయి. రోజూ 60-70 వేల మంది ఈ సర్వీసులను ఉపయోగించు కుంటున్నారు.

### రైలులో ఆకాశయానం - స్కైబస్ మెట్రో

భూగర్భాలూ, భూతలాలూ కూడా సరిపోని, వీలుపడని, పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇటువంటి పరిస్థితులలో రోడ్డుపైన ఎత్తైన స్తంభాలు నిర్మించి, వాటిపై రోడ్డు వేసి, ఆ రోడ్డు కింద రైలు బోగీలు వేలాడదీసి నడిపితే?... దాన్నే స్కై బస్ అంటారు. ఇటువంటి రాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థని మన దేశంలో కొంకణ్ రైల్వే ప్రవేశపెట్టింది. గోవాలోని మాడ్గోవాలో నవంబర్ 2003న నిర్మాణం ప్రారంభమైంది. ఇదే పద్ధతిలో హైదరాబాద్‌లో కూడా ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు, ప్రణాళికలు జరుగుతున్నాయి.

### మోనో రైలు

మామూలుగా రైలు పట్టాలు జతగా ఉంటాయి. కానీ ఒకే పట్టాపై నడిచే రైళ్లను



మోనోరైళ్లంటారు. ఇప్పుడిప్పుడే వినియోగంలోకి వస్తున్న ఈ మోనోరైళ్ల ప్రయత్నాలు పంతొమ్మిదవ శతాబ్ది మధ్య నుండే ప్రారంభమయ్యాయి. కానీ 20వ శతాబ్ది మధ్యలో డిజైన్లు స్థిరపడ్డాయి. సాధారణంగా వీటికి రబ్బరు టైర్లు వాడతారు. కాంక్రీటు దిమ్మెపై నడిచేవే కాకుండా అటువంటి దిమ్మె నుండి వేళ్లాడే రైళ్లూ మోనోరైలు కోవలోకే చెందుతాయి. జపాన్, మలేషియా, ఫ్రాన్స్‌లలో మోనోరైళ్లు ప్రాచుర్యంలో ఉన్నాయి. జపాన్‌లోని ఛీబా అర్బన్ మోనోరైలు ఇప్పటికీ అతి పొడవైన మోనో రైలు వ్యవస్థ. ఇది 15.2 కిమీ పొడవుంది.

### మాగ్ లెవ్

అయస్కాంతంతో నడిచే మాగ్నటిక్ లెవిటేషన్ రైలు (మాగ్ లెవ్) జర్మనీలో అందుబాటులో ఉంది. ఇటువంటి రైలు మోనో రైళ్లలో అత్యంత వేగవంతమైనది. ఇది గంటకు 501 కిమీ వేగంతో ప్రయాణిస్తుంది. పూర్తి వేగంలో ఉన్నప్పుడు ఇది పట్టాలను తాకకుండా గాలిలో తేలుతూ కదులుతుంది.

❋




ప్రగతి నాటక సమాజం
రేపొద్దు.. మేము వేసే నాటకంలో
ఏమరు స్త్రీ వేషం ఒక్కసారి ధరిస్తే
చాలు.. ఇక మీదట మా ఓట్లన్నీ...
మీకేనండీ..!!


నీకు ఎయిడ్స్ లేదని చెబితే వినిపించుకోవేంటయ్యా!
నెలకోసారి వచ్చి టెస్ట్ చెయ్యమంటావా?
మరి అసలే నా పేరు పూలరాజండీ.
Gopal


ఈ టెస్టులన్నీ నాకిప్పుడు అవసరమా డాక్టర్!
డా॥ అవసరం
Gopal


నువ్వు పరీక్షలో పాసయితే నాకు స్వీట్ తినిపించాలిరా రాము!
STOP
Gopal


అర్జెంటుగా గజదొంగ గంగారాం పేరున ఓ బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేస్తారా సార్!
మేనేజర్
సంకోచ బ్యాంక్
Gopal


విగ్రహాన్ని పూర్తి చేసే లోపే ప్రభుత్వం మారిపోయింది...!!
V. Rama Krishna


ఏమండోయ్ మీరు కిడ్నీ బ్యాంక్, హార్ట్ బ్యాంక్ పెట్టండి...
ఫ్యూచర్‌లో రాజకీయ పార్టీ పెట్టడానికి ఉపయోగపడుతుంది!
V. Rama Krishna

కథ

యర్నాగుల సుధాకరరావు

# కమలమ్మగారికి క్షమాపణలు

"ఈమె నాకు అక్షరాలు నేర్పిన గురువమ్మగారు. ఒకప్పుడు కమలమ్మగారు అంటే ఉపాధ్యాయలోకం అంతా చెప్పుకునేది. ఒక నిమిషం వృధా చేయకుండా పిల్లలకు పాఠాలు చెప్పే గొప్ప టీచరమ్మ. ఈమెను గౌరవించడంలో నేనే కాదు. మనందరం గర్వపడాలి. మీ ఇద్దరు అన్నలు ఈమె వద్ద చదువుకున్నారు. ఏదైనా నిలదీశాం అంటే దానికి తప్పకుండా ఒక అర్థం ఉండాలి"

రిటైర్డు టీచర్ కమలమ్మ వృద్ధాప్యం వలన ఎండ భరించలేక తల మీద చేతి సంచి పెట్టుకుని పెద్ద క్యూలో నిలబడి అసహనంగా చౌక డిపోలోకి చూడసాగింది. ఆ క్యూలో ఒకరిద్దరికి కమలమ్మ తెలుసు. "నాలుగు రోజులు తరువాత రాలేకపోయారా? ఈ రెండురోజులు రద్దీగా ఉంటుంది" సానుభూతిగా చెప్పారు.

"క్రిస్మస్ పండుగ వస్తోంది. పిల్లలు వస్తారు. పంచదార, వంటనూనె ఉంటే ఎందుకైనా పనికి వస్తుంది. అందుకే ఇలా వచ్చి ఎండకు విలవిలలాడుతున్నాను" చెప్పి నిట్టూర్చింది.

"అన్నట్టు అమ్మగారు! చౌకడిపో నడిపే చిన్నబాబు మీ దగ్గరే కదా చదువుకున్నాడు. మిమ్మల్ని చూసి పక్కనుంచి పిలిచి ఇవ్వడా? ఆరోజుల్లో ఎలా పాఠాలు చెప్పేవారు? మీరు పేపర్ బెత్తంతో వస్తే చాలు! నాల్గవ తరగతి పిల్లలు ఎలా హడలిపోయే వారు" పాతరోజులు గుర్తుచేశాడు ఇద్దరిలో ఒకడు.

"నాయనా, గురువులను గౌరవించే రోజులు ఎప్పుడో అంతరించాయి. అన్నట్టు నేను ఎప్పుడు వచ్చినా డిపో ఖాళీగా ఉండేది. చిన్నబాబు ఏదో పలకరించి నాకు సరుకులు ఇచ్చేవాడు తప్పితే ఇలా క్యూలో నిలబడి వాడికి నేనెప్పుడూ కనిపించలేదు. అయినా, వాడు అంత మంచి మనిషికాదు. వాడి తండ్రి బుద్ధులతో ముమ్మూర్తులా పుట్టాడు. ఎవరినీ ఖాతరు చేయడు. ఎవరి వ్యక్తిత్వం వారిది. ఏం చేస్తాం! ఎండకూడా నాకోసమే అన్నట్టు ఈరోజు చాలా తీక్షణంగా ఉంది" చెమటలు తుడుచుకుంటూ నీరసంగా చెప్పింది.

క్యూ మరింత పెరిగిపోయి తోపులాట అయ్యింది. చిన్నబాబు ఇవ్వడం ఆపేసి తోపులాటను కంట్రోల్ చేసి "మీరంతా సరిగ్గా ఉంటే వేగంగా ఇస్తాను. మీరు తోపులాటలకు దిగకండి. క్యూ తప్పించుకుని వస్తే ఇవ్వను" మరోసారి హెచ్చరించి లోపలికి వెడుతున్నవాడు కమలమ్మను చూసి "మీరు క్యూలో ఎందుకున్నారు. ఎప్పుడూ ఆఖరి రోజుల్లో వచ్చేవారు. సరే వస్తే వచ్చారు. ఇలా క్యూలో నిలబడకండి. పదండి" అని ఆమె చేతిని పట్టుకుని తీసుకువెడుతుండగా ఒకరిద్దరు నిలదీశారు. "మేమంతా క్యూలో చావాలా? ఇష్టమైనవాళ్ళను లోపలకు తీసుకువెడితే ఎలా?" చిర్రెత్తిపోయారు.

"ఈమె నాకు అక్షరాలు నేర్పిన గురువమ్మగారు. ఒకప్పుడు కమలమ్మగారు అంటే ఉపాధ్యాయలోకం అంతా చెప్పుకునేది. ఒక నిమిషం వృధా చేయకుండా పిల్లలకు పాఠాలు చెప్పే గొప్ప టీచరమ్మ. ఈమెను గౌరవించడంలో నేనే కాదు. మనందరం గర్వపడాలి. మీ ఇద్దరు అన్నలు ఈమె వద్ద చదువుకున్నారు. ఏదైనా నిలదీశాం అంటే దానికి తప్పకుండా ఒక అర్థం ఉండాలి" నిలదీసినవారి నోళ్ళు మూయించి అక్కణ్నించి కదిలాడు.

డిపోలో తన కుర్చీలో కమలమ్మగారిని కూర్చోబెట్టి ఆమెకు ఇవ్వవల్సిన సరుకులు వెంటనే ఇచ్చేసి "క్రిస్మస్ వస్తోంది. మీరు తీసుకువెళ్లని పాత నెలల సరుకులు కావాలంటే ఇస్తాను. మూడు రోజులు తరువాత రండి లేదా ఎవరినైనా పంపండి" చెప్పి పంపాడు. ఆమె మంచు ముద్దలా అయిపోయింది. చిన్నబాబులో ఇంతటి గురుభక్తి ఉందా? నమ్మలేకపోయింది. అక్కణ్నించి ఎప్పుడు వచ్చినా చిన్నబాబు క్యూలో నిలబడకుండా స్వయంగా ఎదురు వచ్చి సరుకులు ఇచ్చి పంపేసేవాడు. "మీకో విషయం చెప్పాలి అమ్మ గారు. మీ దగ్గర చదువుకుంటున్న రోజులలో చెప్ప లేకపోయాను. ఏరోజైనా చెప్పాలని అనుకునే వాడిని. ఆరోజు అంటే నా తొమ్మిదోఏట మీవద్ద నేను తప్పుచేసినవాడిలా నిలబడి మీతో బెత్తం దెబ్బలు తిన్నాను. అది జరిగి ఇప్పుడు 20 ఏళ్ళు అయిపోయాయి" అని ఒకటి రెండుసార్లు కమలమ్మ గారికి తను ఆమె వద్ద చదువుకున్నప్పటి ఒక సంఘటన గురించి చెప్పాలని చూసేవాడు. ఎవరో ఒకరు లేదా ఎమ్.ఆర్.ఓ వంటి అధికారుల రాకపోకలుండేవి. కుదిరేదికాదు.

❊ ❊ ❊

రెండేళ్ల తరువాత కమలమ్మగారు కూతురుని చూడడానికి వెళ్లి విశాఖపట్టణంలో ఆకస్మిక మరణానికి గురయ్యారని తెలిసి చాలా బాధపడ్డాడు. తాను చెప్పుకోవాలనుకున్నది చెప్పుకోనందుకు చాలా విచారించాడు. అమ్మగారు ఎప్పటికప్పుడు గుర్తుకువచ్చేవారు. కమలమ్మగారి దగ్గరబంధువు ఒకరు కలిస్తే మాటలు మధ్య ఆమె ఎలా చనిపోయింది? ఎక్కడ సమాధిచేశారు? కనుక్కున్నాడు. ఆ తరువాత విశాఖపట్టణం వెళ్ళి సమాధులున్న చోటికి మరో క్రిస్టియన్ ఫ్రెండు జాన్‌తో కలిసివెళ్లాడు. అక్కడ కొన్ని వందల సమాధులున్నాయి. వెతకడం కష్టమే. అయినా ఓపిగ్గా వెతికాడు. ఒకచోట సమాధిపై రాసుంది. కమలా ప్రియదాస్. ఒక్కసారి ఒళ్ళు పులకించింది. చిన్నబాబు కళ్లవెంట అశ్రువులు జారిపడ్డాయి. చేతులు జోడించాడు. కొంతసేపు అలా ఉండిపోయాడు.

"నేను దుర్మార్గుడిని కాను. కాలేను. అమ్మగారూ! ఆరోజు మీకు చెప్పుకోవడానికి నాకు వయస్సు చాలదు. మీరు పొరపడి నన్ను దండించి శాపనార్థం పెట్టారు. బెంచిమీద నిలబెట్టి నన్ను తోటి విద్యార్థులకు చూపించి 'వీడు పెద్దవాడయ్యాక పరమదుర్మార్గుడు అయిపోతాడు. ఒకవేళ నాలాంటి గురువులు కన్పిస్తే వీడు ఇంత రాయి పుచ్చుకుని చాచికొడ్తాడు. అప్పుడు వచ్చే రక్తం చూసిగాని శాంతించడు' అని నన్ను బెత్తంతో కొట్టి గోడకుర్చీ వేసిగాని మీరు శాంతించలేదు. గుర్తుందా అమ్మగారు..." అని అడిగాడు.

పక్కనే నిలబడి ఆసక్తిగా వింటున్న జాన్ బిక్కముఖం వేశాడు. ఆశ్చర్యంగా విన్నాడు.

"అమ్మగారూ... ఆరోజు నేను తప్పు చేయలేదు. మీరు నాకు చెప్పిన పని చేయకపోవడానికి కారణం వేరే ఉంది. ఆరోజు నా తల్లిదండ్రులే మీరు చెప్పిన పనికి నిరోధకులయ్యారు. మీ సమాధి ముందు నేను చెప్పే మాటలను నమ్మి నన్ను మన్నించండి. ఇది చెప్పడానికి అప్పటినుంచి ఎంతో ప్రయత్నించాను. ఏళ్లు గడిచిపోయాయి. నేను చెప్పకుండానే మీరు కన్ను మూశారు" చేతులు జోడించి చెప్పి అక్కడే కూర్చుండిపోయాడు. కాసేపటికి కళ్ళు తుడుచుకుని లేచాడు. సమాధుల వద్దనుంచి

బయలుదేరి రోడ్డు ఎక్కారు. మౌనంగా నడవసాగారు. జాన్ నడుస్తూనే చిన్నబాబును చూడసాగాడు.

"జాన్! ఏమిటి అలా చూస్తున్నావు? వీడికి ఏమైనా పిచ్చిపట్టిందా! సమాధులముందు తన నిర్దోషిత్వాన్ని చెప్పుకున్నాడు అని అనుకుంటున్నావు కదూ!"

"ఛ ఛ అలా అనుకోలేదు. కానీ, నమ్మబుద్ధిగాలేదు. ఇలా ఎవరూ చేయరు. 100 కిలోమీటర్లు ప్రయాణించి సమాధుల వద్దకు వచ్చి చెప్పుకోవడం చూశాక... మనిషిలో మానసిక వేదన ఇంతగా నిక్షిప్తమై ఉంటుందా అనిపించింది. నీ మనసు ఇంతగా స్పందించినందుకు నాకు ఏదోలా ఉంది" అని మాత్రం అనగలిగాడు.

"కమలమ్మగారు మంచి టీచరు. మా ఇంటి ముందే ప్రాథమిక పాఠశాల. అందులో నాల్గవ తరగతిలో కమలమ్మగారు చెప్పేవారు. నాకు తొమ్మిదేళ్ళు. చదువులో నేను అంతంతమాత్రంగానే ఉండేవాడిని. ఎప్పుడూ మా ఇంటిలో అయినదానికి కానిదానికి మానాన్న మా అమ్మను రక్తంకారేలా కొట్టేవాడు. పిల్లల్ని ఏదో కారణం చూపి వారానికోసారి చావ గొట్టేవాడు. అలా తంతే మేము బుద్ధిగా ఉంటామని, చదువుకుంటామని ఆయన ఆలోచన. ఈ విషయం మా వీధిలోనేగాక పక్క వీధులవారికీ తెలుసు. మా ఇల్లు యమపురి అనేవారు. ఎలా బ్రతుకుతున్నారో అని మమ్మల్ని చూసి జాలిపడేవారు. ఒకసారి కమలమ్మగారికి క్లాసులో పాఠాలు చెబుతుండగా చలిజ్వరం వచ్చింది. ఆమె రూమ్‌లో ఒక మూల చిన్న చెక్కబెంచి మీద పడుకున్నారు. మేము ఏదీ చేయలేని వయస్సువాళ్లం. ఈలోగా విషయం తెలిసిన హైస్కూల్ టీచర్... ఆమె భర్త ప్రియదాస్ వచ్చి కొన్ని టాబ్లెట్లు ఇచ్చి వెళ్ళిపోయారు. స్కూలు ఎదురుగా ఉన్న మా ఇంటికెళ్లి వేడినీళ్ళు తీసుకుని రమ్మని అమ్మగారు నన్ను పంపారు. నేను తెద్దామని ఇంటికి వెళ్ళేసరికి మానాన్న సరిగ్గా కూర ఉడకలేదని, ఉప్పు చాలలేదని ఏదో ఒక విషయంతో అమ్మను రక్తం వచ్చేలా కొట్టి ఇంటి మధ్యలో అడ్డదిడ్డంగా పడేశాడు. నేను భయపడ్తూ వెళ్ళేసరికి నిన్న రాత్రి ఎందుకు చదవలేదని నన్ను చావగొట్టి పడేశాడు. ఈలోగా ఉదయం పూట స్కూలు లాంగ్‌బెల్ పడింది. మళ్లీ రెండు గంటలు గడిచాక రెండోపూట స్కూలు. అంతవరకు నాన్న తిడ్తూనే గడిపేశాడు. కమలమ్మగారికి వేడినీళ్ళు అమ్మకు చెప్పి ఎలా వేడిచేసి పట్టుకుని వెళ్లాలో తెలియక ఊరుకున్నాను. ఈలోగా మధ్యాహ్నం బడికి వచ్చే నా బాల్యమిత్రుడు బంగారురాజు క్లాసులోకి పడుకున్న కమలమ్మగారిని పరామర్శించాడు. "జ్వరం తగ్గిందా? చిన్నబాబు నీళ్లు ఇచ్చి వెళ్లిపోయాడా?"

"రేయ్ నాయనా! అప్పుడు వెళ్లినవాడు ఇంతవరకు నీళ్ళు తెచ్చి ఇవ్వలేదురా! ఒళ్ళు కాలిపోతోంది రా. మరేం తగ్గుతుంది" అని నొసలు నొక్కుకోసాగారు. అప్పుడు బంగారురాజు అదేవీధిలో ఉన్న వాడింటినుంచి పెద్దపళ్ళెంలో కాల్చిన రొట్టె, వేడిపాలు, వేడినీళ్ళు తీసుకుని కమలమ్మగారి ముందు పెట్టాడు.

కమలమ్మగారు రొట్టె తిని, వేడి పాలు తాగి వేడినీళ్లతో టాబ్లెట్ వేసుకుని బాగా రిలాక్స్ అయ్యారు. మధ్యాహ్నం బడి బెల్ కొట్టేసరికి కమలమ్మగారికి జ్వరం పూర్తిగా తగ్గిపోయింది. పిల్లలంతా వచ్చారు. కొన్ని నిముషాల లేటులో నేను వెళ్లాను. చూడగానే ఉగ్రురాలైంది. "ఏరా నీకు ఏమి చెప్పాను!! ఏమి చేశావురా! ఇలారా, వచ్చి నిలబడు. పిల్లలూ... చూడండి! వీడు పచ్చిమోసగాడు. ఏరా నేను అడిగింది మీ అమ్మకు చెప్పావా లేదా? అబద్ధం చెప్పావో ఇప్పుడు మీ ఇంటికి ఋజువుకు వస్తాను. అప్పుడు నిన్ను ఏమి చేస్తానో తెలియదు" అని ఉరిమింది. అసలే కమలమ్మగారి దండన తీవ్రంగా ఉంటుంది. పిల్లలంతా భయంగా చూసాగారు.

"నిన్నేరా అడుగుతుంటే చెప్పవేం?" అనడిగారు.

"అమ్మకు చెప్పలేదని చెప్పాను. అంతకుమించి ఒక్కమాట చెప్పలేకపోయాను. అమ్మను నాన్న కొట్టడం అప్పట్లో నాకు పెద్ద నామోషీగా ఉండేది. అందుకే చెప్పుకోలేకపోయాను"

"ఎందుకు చెప్పలేదు. చెబితే మీ అమ్మ వేడినీళ్ళు ఇస్తుంది. నేను టాబ్లెట్ వేసుకుని ఇలా పాఠాలు చెబుతానని తెలివిగా మధ్యాహ్నం పూట స్కూలు ఎగగొట్టాలని నీ దుష్ట ఆలోచన కదరా! నిన్ను ఏమిచేసినా పాపంలేదు. నీలాంటివాడు భూమికి భారం" అని చేతులు చాపించి వరుసగా బెత్తంతో అరచేతులు ఎర్రగా కందేలా కొట్టింది.

నాకళ్లు ఎర్రగా అయిపోయాయి. అంతచిన్న వయస్సులో తోటి పిల్లల ఎదుట దోషిని చేసి దండిస్తుంటే తట్టుకోలేక చేతులు నొప్పి పుడ్తున్నా ఏడవకుండా అలానే భరించాను. ఇంకా కమలమ్మ గారికి కోపం తీరలేదు. తప్పు చేస్తే దండించాలి. మొక్కయి వంగనిది మానై వంగదు. అని గట్టిగా నమ్మే బోధకురాలు.



"నా బుగ్గలు సాగదీసి ఇలా నవ్వు అందరికి కన్పించవు. అదిగో ఆ బెంచి మీద నిలబడు. పిల్లలూ వీడిని చూడండి. వీడు పెద్ద య్యాక నాలాంటి గురు వులు కన్పిస్తే కనీసం గౌరవం కూడా ఇచ్చే రకం కాదు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది. పువ్వుగానే వీడి పరిమళం ఎంత గొప్పదో అర్థం అయ్యిందా? అదిగో బంగారు రాజున్నాడు చూడండి. వాడు నన్ను చూసి వెంటనే ఇంటికి వెళ్ళి నీళ్ళు తెమ్మంటే పాలు రొట్టె తెచ్చి ఇచ్చాడు. వాడికి మారుడితల్లి అయినా ఏదో చెప్పి తీసుకొని వచ్చాడు. వాడికి గురువులంటే మంచి అభిప్రాయం ఉంది"

"నా బుగ్గలు సాగదీసి ఇలా నవ్వు అందరికి కన్పించవు. అదిగో ఆ బెంచి మీద నిలబడు. పిల్లలూ వీడిని చూడండి. వీడు పెద్దయ్యాక నాలాంటి గురువులు కన్పిస్తే కనీసం గౌరవం కూడా ఇచ్చే రకం కాదు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది. పువ్వుగానే వీడి పరిమళం ఎంత గొప్పదో అర్థం అయ్యిందా? అదిగో బంగారు రాజున్నాడు చూడండి. వాడు నన్ను చూసి వెంటనే ఇంటికి వెళ్ళి నీళ్ళు తెమ్మంటే పాలు రొట్టె తెచ్చి ఇచ్చాడు. వాడికి మారుడితల్లి అయినా ఏదో చెప్పి తీసుకొని వచ్చాడు. వాడికి గురువులంటే మంచి అభిప్రాయం ఉంది" నేను ఊపిరి మరిచి బిక్కు బిక్కుమని చూడసాగాను. తోటి పిల్లలూ నా వైపు అర్థంకాని చూపులు చూశారు.

నన్ను ఒక మూల కూర్చోమని చెప్పి పాఠం చెప్పి అందులో వేయాల్సిన ప్రశ్నలు అన్నీ నాకే వేసి చెప్పకపోతే పేపర్ బెత్తంకు మరోసారి పని చెప్పారు".

* * *

"అప్పుడు నాల్గవ తరగతి చివరి ఎంట్రన్సు పాసయితే, ఐదు చదవకుండానే ఆరుకి వెళ్లవచ్చు. ఎలాగైనా నన్ను ఆరులో కూర్చోబెట్టాలని మానాన్న ఆ ఎంట్రన్సు రాయించాడు. అప్పుడు ఏదో పాస్ అయ్యాననిపించుకుని ఆరుకు వెళ్ళే మార్గం సుగమం చేసుకున్నాను. ఆ ఆనందం పూర్తిగా అనుభవించకముందే వచ్చింది ప్రోగ్రెస్ కార్డు. అందులో తక్కువ మార్కులు వచ్చినా నాన్నకు పెద్దగా బాధ అనిపించలేదు. ఐదవ తరగతి బుక్సు చదివినందున ఇలా నాలుగులో తక్కువయ్యాయి. అని నన్ను తీవ్రంగా దండించకుండా వదిలేశాడు. అక్కడికి కొన్నాళ్లకు నాలుగు నుంచి హైస్కూలుకు వెళ్ళిపోయాను.

ఆదో విద్యా ప్రపంచం. జిల్లాలో మా హై స్కూల్ పెద్దది. మూడవ స్థానంలో ఉంది. అలా నా నాల్గవతరగతి చదువులో జరిగిన కమలమ్మగారి జ్వరం నన్ను ఎప్పుడూ గుర్తుచేస్తూనే ఉండేది. ఆ తరువాత డిగ్రీ పూర్తయింది. మాకున్న పెద్ద బుక్‌స్టాల్‌లో మా నాన్నకు చేదోడుగా ఉండిపోయాను. అప్పుడప్పుడు కమలమ్మగారు కన్పించినా నన్ను చూసి తలతిప్పుకునేవారు. ఆమెకు ఎలా చెప్పాలి. ముఖం చూడకుండా వెళ్ళిపోతున్న ఆమెకు ఆపి చెబితే బావుండదు"

తన చిన్నతనంలో జరిగిన కథనం మొత్తం చిన్నబాబు ఏకరువు పెట్టాడు. జాన్ ఉత్కంఠగా... విస్మయంగా విన్నాడు.

"నీలో ఇంత వేదన నిక్షిప్తమై ఉందా! కమలమ్మ గారికి నీ నిర్దోషిత్వం నిరూపించుకోవడానికి నీ ప్రయత్నం చాలా గొప్పగా ఉంది. ఈ కథనం నా వరకే పరిమితం కాకూడదు. ఇది విశ్వమంతా తెలియాలి. గురుశిష్యుల మధ్య ఇలాంటివి సహజంగా ఎన్నో జరుగుతుంటాయి. కానీ, పిల్లల మనస్సులో ఇంతగా ముద్ర పడటం చాలా వింతగా ఉంది. ఇప్పుడు ముఖ్యంగా కాన్వెంటులు పిల్లలకు బలవంతంగా మైండ్‌సెట్ మార్చే కార్ఖానాలయ్యాయి. కొన్ని వేలమంది పిల్లల మనస్సులో ఇలాంటి మానసిక హింసలు ఎన్నో గూడు కట్టుకుని ఉండి ఉంటాయి. ఇటు విద్య బోధించే గురువులు, అటు చదువుకునే పిల్లలకు, పిల్లల ముందే మూర్ఖంగా హింసాత్మకంగా ప్రవర్తించే తండ్రులకు తెలియచేయాల్సిన కథనం ఇది" జాన్ చెప్పి ఆలోచనలో పడ్డాడు. ఆ తరువాత ఇద్దరు మౌనంగా నడవసాగారు.

లోపలి లోపలిలో...

డా॥ జె.పి.వైద్య

లఖ్నో - అమీనాబాద్ ప్రాంతంలో 'రాయల్ సినిమా' ఉండేది. 'మూకీ' సినిమాల జమానా అది. సీన్- సన్నివేశం గమనించి ఓ పెద్దాయన తెర కింద కూర్చుండి 'హార్మోనియం' వాయించే వారు. ఆ రోజుల్లో అదే పద్ధతి. ఆయన పేరు 'లద్దన్‌సాబ్'. మన 'బచ్చా' అష్టకష్టాలు పడి ప్రతి 'షో'కు అక్కడికి వెళ్ళి తారట్లాడే వాడు. తెల్లారి ఆ స్వరాలను దుకాణంలో తిరిగి మ్రోగించేవాడు.

ఓ రోజు 'గుర్బత్ అలీ' బచ్చాగాడి హార్మోనియం ప్రయోగాలను చూసి మండి పడ్డాడు.

'ఓర్నీయవ్వ! ఇందుకా నువ్వు పొద్దున్నే వచ్చి చస్తున్నావ్? నా హార్మోనియం పెట్టెల్ని విరగ్గొట్టి పారిపోతావా ఏందీ?' అని వాయించాడు.

బచ్చా గజగజా వణికి పోయాడు.

# హిందీ సినీ సంగీత పితామహుడు

# నౌషాద్

**జ్ఞా**నం పుస్తకాల్లో ఉండదు. అనుభవాల్లో ఉంటుంది. అనుభవాలను గుచ్చిన జీవితపు దండల్లో ఉంటుంది.

మరి, జీవితం?

జీవితం ఒక సంక్లిష్టమైన లెక్క. చేసిన ప్రతి స్టెప్పు మళ్ళీ మళ్ళీ పరిశీలించి చూసుకోవాల్సిందే.

లేకుంటే లెక్కలు తప్పిపోతాయి.

"అభీ సాజ్ - ఏ- దిల్ మేఁ తరానే బహుత్ హై
అభీ జిందగీ కే బహానే బహుత్ హై"

(అయ్యా...! ఇంకా గుండె అనే వాద్యం నిండా బాణీలు మస్తుగా నిండి ఉన్నాయి... జీవితంలో కారణాలూ- నెపాలూ నిండి ఉన్నంతగా...!) అసలు కొందరు కళ్ళు మూసుకొని "ఏం చేస్తం తమ్మీ.... జిందగీల కండ్లు మూసుకొని నడిశి చచ్చిన గదా.... గిట్లయిపోయినా! లేకుంటే ఏమేమో అయి పోతుంటి... గిట్ల హౌలా గాడి తీరు నీ ముంగట ఉంటుంటినా?' అని వాపోతారు.

ఇప్పుడు మన చుట్టూ శబ్ద కాలుష్యంలా వ్యాపించిన రణగొణ ధ్వనుల ఆల్తూ-ఫాల్తూ లొల్లి సంగీతం విన్నప్పుడల్లా 'అమ్మో! ఎట పోయెను అలనాటి సంగీత స్వర్ణయుగము' అని మనస్సు తల్లడిల్లి పోతుంది.

మనం ఈ పూట అద్వితీయమైన హిందీ సినీ సంగీత పితామహుడు 'నౌషాద్ అలీ' గురించి ముచ్చటించుకుందాం.

డిస్కో సంగీతం మనల్ని ఎంత బాది చంపుకుతిన్నా-

మెడలో ఒక్క మంగళ సూత్రం తప్ప సకల స్వర్ణాభూషణాలూ అలంకరించుకొని, చడీ చప్పుడు చేయకుండా 'పాశ్చాత్యుల' సంగీత బాణీలను 'లటుక్కున చటుక్కున' మూడో కంటికి తెలీకుండా లేపి, అక్కడా ఇక్కడా కాస్తంత భారతీయం 'ములామా' తొడిగించిన 'మహనీయులు' సంగీతం పేర్న మనల్ని వాయించి పారేస్తున్నా..

అనంతం... అద్భుతం... ఆశ్చర్యం.. అన్పించే 'ఎవర్ గ్రీన్' భారతీయ శాస్త్రీయ సంగీతానికి ఆఖరు క్షణం దాకా కేరాఫ్ అడ్రస్‌గా ఉండిపోయిన 'నౌషాద్ అలీ', 'పాంచ నమాజ్ ముస్లిం' అయినా - భారతీయ సినీ సంగీత నీలాకాశంలో తరతరాలుగా వెలుగు ప్రసరించే భారతీయుడు. అసల్ సిసల్ హిందుస్తానీ. అందుకు సంగీతం దీవానా గాళ్ళందరూ నిస్సందేహంగా ఆయనకు రుణపడి ఉండాల్సిందే.

హిందుస్తానీ శాస్త్రీయ సంగీతం అంటే ఆయన ఆత్మ... ఊపిరి.. జీవితం... ఎవరో మెల్లగా గునిసినట్టు 'ఊఁ' మరి, ఆ మధ్య ఫాస్ట్ ట్రాక్ సంగీతం, ఫాక్స్ టార్ట్, రొంబాసాంబా, ట్విస్ట్, చాచాచా, రాక్, ఇలా..." అని వాక్యం పూర్తి చేయక ముందే ఆయన సున్నితంగా వారించే వారు చెయ్యెత్తి.

'చూడు బాబు...! ఢిల్లీని ఏడుసార్లు పూర్తిగా తుడుచుకుపోయేట్టు లూటీ చేశారు దుండగులు దండయాత్ర చేసి. ఏమైందీ? ఇవ్వాళ 'ఢిల్లీ' సగర్వంగా తలెత్తుకొని నిలబడి ఉందా లేదా! భారతీయ శాస్త్రీయ సంగీతం అచ్చం అలాంటిదే నాయనా! రాకులొస్తాయి... పోతాయి...! డిస్కోల కర్ణకఠోరపు రణగొణ గొడవల్లోనూ... శాంతంగా సాగే 'గజళ్ళ మెహెఫిల్స్' సాగుతున్నాయా లేదా? రీమిక్స్‌ల లొల్లి సంగీతం విని చెవుల్లో తుప్పు నింపుకున్నాక పిచ్చి పిచ్చిగా జనాలు పడీ పడీ 'మెహెదీ హసన్? ఎక్కడున్నాడు 'గులామ్ అలీ'? ఏరీ 'జగ్‌జీత్ - చిత్రా సింగ్‌లూ!'...ఎక్కడా ఎక్కడా 'తలత్ అజీజ్'? అంటున్నారా లేదా!'...

నౌషాద్ సంగీత ప్రేమ అలాంటిది.

పూర్వం హకీమ్‌లూ, వైద్యులు - నాడీ జ్ఞానంతో పాటు అంతో ఇంతో సంగీత జ్ఞానాన్ని రంగరించుకొని ప్రాణాలు కాపాడిన వాళ్ళే! -"లివర్' అంటే కాలేయం దెబ్బతింటే 'రుఫ్‌వాదీ' స్వరాలు విన్పించవయ్యా బాబూ..! గుండెనొప్పా? ఊఁ కాస్త పథ్యం అదీ పాటించు మరీ... పొద్దున్నే లేచి అలా 'పిట్టల' కుచ్... కుచ్ సంగీతం' వింటూ ఎక్కడున్నాయా... 'గాంధార స్వర లహరులూ? అనీ ఓ చెవి పారేయ్.. ఏం?

అర్థమైందా?' అని హితసూక్తులు పలికి-చక్కా ఏ వేరో, ఆకో, కాండం ముక్కో దంచుతూ 'రాగాలు' గునగునాయించే వాళ్లు.

'భూమి గుండ్రంగా వుందోచ్...' అన్నట్లు నేడు మనం 'కార్పోరేట్ హాస్పిటల్ సంస్కృతి'కి దూరం నుంచే 'సాష్టాంగ నమస్కారం చేసి పారేసి 'మార్నింగ్ వాక్' అంటూ 'అలారం' పెట్టి మరీ లేస్తున్నామా లేదా?

ఉస్తాద్ ఝుండే ఖాన్ ఆయన గురువు గారు. ఓ పూట పొద్దున్నే హార్మోనియం ముందరేసుకు కూర్చుని గానం చేస్తున్నారు. కళ్ల వెంట 'గంగా జమున'ల ధార. నౌషాద్ కలవరపడిపోయి... 'ఉస్తాద్ గారూ..! ఏమైందీ?' అన్నాడు.

'వురేయ్! మనం 'దునియా దారీ' చేస్తున్న! మహాపాపులంరా...! ఈ స్వర్గీయ స్వరాలు చూడు... ఎంతటి అపురూపమైనవి... ఆహా!' అన్నాడాయన పైకి చేతులెత్తి. లక్నో మహానగరం ఓ మూల 'లాటూష్ రోడ్'! అందులో మరో మూలలో ఉంది 'యస్ ఛోందూ అండ్ సన్స్' దుకాణం. సంగీత వాద్యాల అపురూపం 'అడ్డా'. 'బాల నౌషాద్' తరచూ ఆ దుకాణం ముందు తచ్చాడే వాడు. దుకాణం 'మాలిక్' గుర్బత్ అలీ ఎన్నో రోజులుగా ఆ 'బచ్చాగాడ్ని' గమనించారు.

-'ఏం సంగతి? రోజూ తారట్లాడుతున్నావ్?" - ఆయన కళ్ళు ప్రశ్నించాయి.

-'అయ్యా! పని ఇప్పిస్తారా?' బచ్చాగాడు ప్రాధేయ పడ్డాడు.

ఎంతో వినయ విధేయతలతో పని చేసి ఆయన విశ్వాసం చూరగొన్నాడు 'బచ్చా' అన్ని వాద్యాలు శుభ్రం చేస్తూ, దులుపుతూ మెల్లగా 'హార్మోనియం'తో దోస్తీ చేశాడు 'బచ్చా! 'కుంయ్cc... టుంయ్cc' మంటూ వచ్చే ఆ అవిస్మరణీయ స్వరాల కోసం పొద్దున్నే వచ్చేవాడు.

లక్నో - అమీనాబాద్ ప్రాంతంలో 'రాయల్ సినిమా' ఉండేది. 'మూకీ' సినిమాల జమానా అది. సీన్- సన్నివేశం గమనించి ఓ పెద్దాయన తెర కింద కూర్చుండి 'హార్మోనియం' వాయించే వారు. ఆ రోజుల్లో అదే పద్ధతి. ఆయన పేరు 'లడ్డన్‌సాబ్'. మన 'బచ్చా' అష్టకష్టాలు పడి ప్రతి 'షో'కు అక్కడికి వెళ్ళి తారట్లాడే వాడు. తెల్లారి ఆ స్వరాలను దుకాణంలో తిరిగి మ్రోగించేవాడు.

ఓ రోజు 'గుర్బత్ అలీ' బచ్చాగాడి హార్మోనియం ప్రయోగాలను చూసి మండి పడ్డాడు.

'ఓర్నీయవ్వ! ఇందుకా నువ్వు పొద్దున్నే వచ్చి చస్తున్నావ్? నా హార్మోనియం పెట్టెల్ని విరగ్గొట్టి పారిపోతావా ఏందీ?' అని వాయించాడు.

బచ్చా గజగజా వణికి పోయాడు.

'...ఊc! నిన్ను శిక్షించాల్సిందేరోయ్!' అని - సరికొత్త హార్మోనియం పెట్టె తీసి ముందట పెట్టాడు.

బచ్చా 'గజగజలు' తగ్గలేదు-

"ఊcc! నీకిదే శిక్ష! నదూc దీన్ని ఇంటికి తీసుకుపో! ఇది నీదే ! బాగా వాయించి ప్రాక్టీస్ చేయ్" అని ముసి ముసిగా నవ్వాడు.

అటు 'రాయల్ సినిమా' లోనూ 'ఫ్రీ ఎంట్రీ' పొందేలా చేశాడు గుర్బత్ అలీ!

'గుర్బత్' అంటే పర ప్రాంతంలో నివసించడం, పేదరికం అని అర్థం.

కాని- గుర్బత్ 'బచ్చా నౌషాద్' కోసం వర ప్రసాదం లాంటి దేవుళ్ళయ్యారు. కన్న తండ్రికి

**'బాల నౌషాద్' తరచూ ఆ దుకాణం ముందు తచ్చాడే వాడు. దుకాణం 'మాలిక్' గుర్బత్ అలీ ఎన్నో రోజులుగా ఆ 'బచ్చాగాడ్ని' గమనించారు.**

**-'ఏం సంగతి? రోజూ తారట్లాడుతున్నావ్?" - ఆయన కళ్ళు ప్రశ్నించాయి.**

**-'అయ్యా! పని ఇప్పిస్తారా?' బచ్చాగాడు ప్రాధేయ పడ్డాడు.**

మటుకు సంగీతం అంటే తగని వొళ్ళు మంట. అది భరించలేక 'నౌషాద్' జీవితాన్ని వెతుక్కుంటూ 'బాంబే' చేరుకున్నాడు.

ఆదుకున్నవాళ్ళు మిత్రులే! గమ్మత్తేమిటంటే నౌషాద్ తండ్రికీ - మామయ్యకు సంగీతం అంటే అస్సలే పడదు. పెళ్ళిలో నౌషాద్ అలీ గుర్రం మీద ఊరేగుతుంటే- ఆయన పాటలే వాయిస్తున్నారు బ్యాండ్ వాళ్ళు. వాటి స్వరకర్త స్వయంగా నౌషాద్ అనే విషయం వాళ్లకు తెలియదు.

బాంబేలో ఫుట్‌పాత్ మీద జీవితం గడిపిన నౌషాద్‌కు రోడ్డుకవతలవైపున "బ్రాడ్ వే" థియేటర్‌లో 'సిల్వర్ జూబ్లీ' సంగీతానికి పురస్కారం పొందే స్థితికి ఎదగడానికి 16 సంవత్సరాలు పట్టాయి. అదే 'సిల్వర్ జూబ్లీ' గోల్డెన్ మెలోడీల అపూర్వ చిత్రం.

ఇంకా సంగీత రసజ్ఞుల గుండెల్లో గూడు కట్టుకొని శాశ్వతంగా ఉండిపోయిన అద్భుత, శాస్త్రీయ గీతాల మణిహారాల 'సినిమా' - 'బైజు బావరా'

10 సంవత్సరాల చిరు వయస్సులో 'సూరయ్యా' గొంతును సంగీత ప్రియులకు పరిచయం చేసిన ఘనత నౌషాద్‌దే. 'ఆవాజ్ దే కహాc హై... దునియా మేరీ జవాcహై' గానం చేసిన 'నూర్జహాన్'ను మనం ఇంకా మరచిపోలేదు... మరచిపోము కూడా.... రఫీ, షకీల్ బదాయునీ, లతా మంగేష్కర్‌ను 'గట్టి పునాది' రాళ్ళ మీద నిలబెట్టిన శ్రేయస్సు వారిదే.

టున్ టున్ భారీకాయం. ఓ మాదిరి 'కామెడియన్' పాత్రల్లో చూసిన వారికి- ఆవిడ అసలు పేరు 'ఉమాదేవి' అనీ - 'దర్ద్'లోని 'ఎవర్ గ్రీన్' పాట - 'అఫ్‌సానా లిఖ్ రహీc హు - దిలే బేకరార్‌కా' గాయని ఆవిడే అన్నది తెలిసి ఒక అందమైన షాక్ కదల్చకుండా ఉంటుందా?

'బాబుల్' లోని తలత్-లతా-శమ్షాద్-రఫీ' ల గీతాల 'విందు' ఎవరు మరచిపోతారనీ? 'మిల్‌తే హి ఆంఖేc దిల్ హువా దీవానా కిసీకా', 'దీదార్'లోని 'బచ్‌పన్ కే దిన్ భూలాన దేనా- ఆజ్ హసే కల్ రూలాన దేనా', 'దీవానా' లోని తస్వీర్ బనాతా హుc తేరీ ఖూనే జిగర్ సే' - 'ఆన్' లోని దిల్ మె ఛుపాకే ప్యార్‌కా తుఫాన్ లే చలే', 'అమర్'లో 'తేరే సదకే బలమ్', ఉడన్ ఖటోలా లోని 'ముహబ్బత్‌కే రాహోc మే చల్నా సంభల్‌కే', 'మదర్ ఇండియా'లోని 'హోలీ ఆయీ రే కన్హాయి', 'మేరే మెహెబూబ్'లోని ' ఏ హుస్న్ జరా జాగ్ తుఝే ఇష్క జగాయే'- 'మేరే మెహెబూబ్ మే క్యానహీ', 'కోహినూర్'లోని 'దో సితారోc కా జమీc పర్ హై మిలన్' - 'మధుబన్‌మే రాధికా నాచే'-'బైజు బావ్రా'లో 'ఓ దునియా కే రఖ్ వాలే' - 'మేలా'లో 'ఏ జిందగీకే మేలే' , 'మొగల్ - ఏ ఆజమ్'లోని 'ప్యార్ కియాతో డర్నా క్యా'... ఎన్నని నమోదు చేయాలి?

నేటికీ ప్రతి రోజు ఉదయం రేడియో సిలోన్‌లో 8 గంటలకు కాస్తంత ముందుగా 'కుందన్ లాల్ సెహెగల్' పాట ఒకటి కచ్చితంగా 'ఆశీర్వాదం' ఇచ్చినట్టు వస్తుంది. నౌషాద్ సంగీత దర్శకత్వంలో ఆయన 'జబ్ దిల్ హీ టూట్ గయా - ' గమ్ దియే ముస్తకిల్ కిత్నా నాజుక్ హై దిల్' కన్నా అద్భుతమైన పాటలు పాడగల్గేవాడిని' అని ఎన్నోసార్లు అనుకున్నాడట.

మనం ఎంత మామూలు మనుష్యులమైనా 'రామ్ ఔర్ శ్యాం' - 'సంఘర్ష్'- 'ఆద్మీ' పాటలనూ 'మొహే భూల్ గయే సావరియాc' లాంటి అమర సంగీతాన్నీ విన్న వాళ్ళమే కదా! రీమేక్‌ల 'ఢింగ్... ఢింగ్' లొల్లి విన్నప్పుడల్లా నౌషాద్ తండ్రిలాగో, మామయ్య లాగో చిందులేసి, వీర విహారం చేసి నానా హంగామా చేయగల ఘటికులం కూడా! కాని, 'నౌషాద్'కు లభించినట్టు మనకు 'ఝుండా ఖాన్ గారో - 'గుర్బత్ అలీ' గారో- 'లడ్డన్ సాబ్' గారో దొరకొద్దూ?

అందుకే 'లొల్లి' చేయకుండా పాత పాటలు విందాం! బస్!

అంతకన్నా మనం చేయగలిగిన పుణ్యకార్యం ఇంకేదైనా ఉన్నదా భైసాబ్?

**దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.**

**ఫోన్ : 08732223622**

## పెద్ద దిక్కు పోతే... ఉద్యోగం ఇవ్వరా!




మా నాన్నగారు నెల్లూరు జిల్లా ఎస్సీ కార్పొరేషన్‌లో ఉద్యోగి. 6-01-07న చనిపోయారు. అప్పటికి సీనియర్ సహాయకుడిగా పని చేసేవారు. మా కుటుంబంలో ఎవరికీ ఎటువంటి జీవనోపాధి లేదు. మా కుటుంబ సభ్యులు ఐదు మంది. పెద్దవాడినైన నేను ప్రైవేటు హాస్పటల్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసేవాడిని. రెండవ కుమార్తె బి.ఇడి. చేస్తున్నది. మూడవ కుమారుడు డిగ్రీ చదువుతున్నాడు. మా నాన్నగారి సంపాదనపైనే జీవనం గడుస్తోంది. ఆయన చనిపోయిన పిదప కారుణ్య నియామక పథకం కింద మా చిన్న తమ్ముడు దయాకర్‌కు ఉద్యోగం ఇవ్వవలసినదిగా జిల్లా కలెక్టర్ గార్కి, నగర ఎమ్మెల్యే ద్వారా ధరఖాస్తు ఇచ్చాం. కలెక్టర్ గారు 'ఇది మా పరిధిలో లేదు. మీరు మీ సంస్థలో మాత్రమే నియామకం కల్పించాలి. అంతేకాని మరే ఇతర సంస్థలో అవకాశం ఇవ్వడం జరగదు' అన్నారు. సదరు ఎస్సీ కార్పొరేషన్ ఇ.డి గారు జి.ఓ.నెం. 36 ప్రకారం పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ డిపార్ట్‌మెంట్‌లలో ఉద్యోగం కల్పించడం వీలుపడదని ఎక్స్‌గ్రేషియా 70,000/- తీసుకోమని నోటీస్ ఇచ్చారు. మా నాన్నగారికి మరో 20 సంవత్సరాల వరకు సర్వీసు ఉంది. కాబట్టి తమరు మా స్థితిగతులను పరిశీలించి మీ యొక్క అమూల్యమైన సలహా తెలుపగలరు.

కె. చిరంజీవి కుమార్, నెల్లూరు.

ప్రస్తుతం ప్రభుత్వ రంగ సంస్థల్లోనే కాదు, ప్రభుత్వ డిపార్టుమెంటుల్లో కూడా కారుణ్య నియామకం పథకం ఎత్తివేశారు. అది ప్రభుత్వం వారి విచక్షణమీద ఆధారపడి వుంటుందిగాని, అది మీకు ఓ హక్కుగా పొందలేరు. కలెక్టర్ గారికి మరియు, కార్పొరేషన్ ఎం.డి./ఇడి గార్కి కూడా దరఖాస్తు చేసుకోండి. వాటిలో ఉన్న ఖాళీలను అవసరాన్ని బట్టి నియమించవచ్చును. దానిని కోర్టుకెళ్లి హక్కుగా పొందలేరు.

## తండ్రి ఆస్తిలో ఆడపిల్లలకు హక్కు వుంటుందా!



మా నాన్న గారు ప్రభుత్వ ఉద్యోగి. ఆరు నెలల కిందట చనిపోయారు. ఆయనకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య మరణించగా రెండో వివాహం చేసుకోవాల్సి వచ్చింది. మొదటి భార్యకు ఒక కూతురు (పెళ్ళి అయింది). రెండో భార్యకు ముగ్గురు కూతుర్లు (పెళ్ళి అయింది), ఇద్దరు కుమారులు (పెళ్ళి కాలేదు). మా నాన్నగారి పేరిట నాలుగు ఎకరాల పొలం, ఒక ఇల్లు, 2 ప్లాట్ల స్థలం, డిపార్ట్‌మెంట్ నుండి వచ్చిన కొంత డబ్బు మరియు పాలసీ (పిఎల్ఐ) వుంది. మా అమ్మ (రెండో భార్య) పేరిట 1 ప్లాట్ స్థలం ఉన్నది. ఇదీ నాన్నగారి కష్టార్జితమే. మా నాన్నగారి మొదటి భార్య ( మొదటి భార్య) కూతురు వచ్చి నాన్నగారి పేరిట గల ఆస్తులలోను, డబ్బులలో పాలసీ డబ్బులోను, రెండో భార్య ఆస్తులలో వాటా ఇవ్వమని బెదిరిస్తోంది. అది కూడా సగానికి సగం వాటా కావాలని... లేదంటే కోర్టు కెళతానని బెదిరిస్తోంది. అసలు న్యాయంగా వారికి ఎంత చెందుతుంది. నాన్న గారి పేర వున్న ఆస్థులపై కుమారులకు హక్కు ఉంటుందని విన్నాను. ఎవరి పేరిట కూడా ఎలాంటి వీలునామాలు, దస్తావేజులు లేవు. ఆస్తుల వాటా ఎవరి ద్వారా జరుగుతుంది. నా వయస్సు 18 సంవత్సరాలు.

వి. కళ్యాణ్ దాస్, న్యూ పాల్వంచ, ఖమ్మం.

మీ అక్కయ్యలకు ఎప్పుడు, వివాహం అయినదో తెలుపలేదు. 1984 సంవత్సరంలో మహిళలకు ఆస్తి హక్కు చట్టం వచ్చింది. అంతకు ముందు పెళ్లి అయితే వారికి వాటాగా ఆస్తి అడిగే హక్కు లేదు. మీ అమ్మగారి ఆస్తి (రెండవ భార్య ప్లాట్) పై ఆవిడకే సర్వహక్కులుంటాయి. వాటిలో ఎవరూ వాటా అడగలేరు. అది మీ నాన్నగారి కష్టార్జితమైనా, అది మీ అక్కయ్యలు నిరూపించలేక పోవచ్చు. తండ్రి ఆస్తిలో కుమారులతో పాటు కూతుళ్లకు సమాన హక్కు ఉంటుంది. రెండవ భార్య, మొదటి భార్య కుమారులకు సమాన హక్కు, వాటాలుంటాయి.



**జి. ఎల్. నరసింహారావు**
హైకోర్టు న్యాయవాది,
9848994240

### పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. న్యాయవాది శ్రీ జి.ఎల్.నరసింహారావు తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం, స్ట్రీట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.



# చికెన్ కర్రీ

**కావలసిన పదార్థాలు:**

చికెన్ లెగ్ జాయింట్లు-12(స్కిన్ తీసినవి), ఉల్లిపాయలు -3 (సన్నగా తరగాలి), టొమేటోలు-2 (తరిగినవి), అల్లం ముక్క -అంగుళం (శుభ్రం చేసి చితక కొట్టాలి), వెల్లుల్లి పాయలు- 2 (వలిచి నూరి ముద్ద చేయాలి), కర్రీ పొడర్ - 1 టేబుల్ స్పూన్ (బజారులో దొరుకుతుంది), పసుపు- తగినంత, ఉప్పు - తగినంత, నిమ్మకాయ రసం- 1 బద్ద, పెరుగు- 1/2 కప్పు

**తయారు చేసే విధానం**

చికెన్ ముక్కలను కడిగి శుభ్రం చేసి, నీరు వడిసేలా పొడిగా తుడిచి, ఓ టేబుల్ స్పూను ఉప్పు రాసి ఒక పక్కన పెట్టుకోవాలి. పాన్‌లో నూనె వేసి, మంట ఎక్కువగా ఉంచి అందులో చికెన్ ముక్కలను వేయండి. ముక్కలు కొంచెం ఎర్రబడేంతవరకూ వేయించండి. జల్లిగంటితో ముక్కలను నూనె వడిగేలా దేవి, మరో పాత్రలోకి తీసుకోండి. పాన్‌లోని నూనెలో తరిగిన ఉల్లి ముక్కలు, అల్లం, వెల్లుల్లి ముద్దలను వేసి, నూనె చాలకపోతే మరికొంత వేసి, ఉల్లి ముక్కలను కొద్దిగా ఎర్రబడేలా వేయించండి. మంట తగ్గించి, పొడిచేసుకున్న సుంగధద్రవాలు, మిగిలిన ఉప్పు వేసి, మరో 2 నిమిషాలు వేయించండి. చికెన్ ముక్కలను వేసి దానిపై పెరుగు, నిమ్మరసాలను కలిపి, సన్నని మంట మీద వుడకనివ్వండి.

టొమేటో ముక్కలను వేసి కలిపి, మూత పెట్టి, మెత్తబడేంత వరకూ ఉడకనివ్వండి. మూతతీసి, మంట పెంచి, చిక్కబడేంతవరకూ, ఉంచండి. దించి, బేకింగు పాత్రలోకి మార్చుకుని, ముందుగా వేడిచేసి వుంచిన ఓవెన్‌లో 10 నిముషాలు వుడకనిచ్చి, వేడి తగ్గించి మరో 40 నిమిషాలు ఉంచండి.

# ఆపిల్ హల్వా

**కావలసిన పదార్థాలు**

ఆపిల్ తురిమినది- 1 కప్పు, పంచదార- 2 కప్పులు,
జీడిపప్పు- 100 గ్రా॥
నెయ్యి - రెండు కప్పులు, గోధుమ పిండి- 1 కప్పు
పాలు - 1 కప్పు
వెనిల్లా ఎసెన్సు (ఇష్టమయితే)

**తయారు చేసే విధానం**

ముందుగా పాలను బాగా కాగ పెట్టాలి. ఆ తరువాత తురిమిన ఆపిల్ దానిలో వేసి బాగా ఉడకనివ్వాలి. గరిటతో బాగా అటూ ఇటూ తిప్పండి. పాలతో బాగా కలిసి పోయేటట్లు చేయాలి. దాంట్లో, గోధుమ పిండిని కొద్ది కొద్దిగా కలుపుతూ బాగా కలియ పెట్టాలి. పిండి బాగా ఉడకనిచ్చి పంచదార పోసి మళ్ళీ బాగా కలపండి. ఆ తరువాత కొద్దిగా నెయ్యి పోస్తూ కలియ పెట్టండి. చిక్కపడిన తరువాత జీడి పప్పు, యెసెన్సు వేసి కలియ పెట్టండి. ఆ తరువాత నెయ్యి రాసిన పళ్ళెంలో గుమ్మరించి ఆరపెట్టండి. మంచి హల్వా తయారవుతుంది.



# పెసరు పప్పు చారు

**కావలసిన పదార్థాలు**

పెసరపప్పు- 1 కప్పు, ఉప్పు - సరిపడా
పెద్ద ఉల్లిపాయ- 1, కరివేపాకు - ఒక రెబ్బ
నూనె - ఒక గరిటెడు, చింతపండు- నిమ్మకాయంత
టొమేటోలు-2, పచ్చిమిర్చి - 4
పోపుసామాను

**తయారు చేసే విధానం**

చింత పండు నానబెట్టుకోవాలి. పప్పు మెత్తగా ఉడికిన తరువాత గరిటతో గట్టిగా నొక్కి తిప్పండి. పప్పు మెత్తగా పేస్టులాగా అయిపోతుంది. దీనిలో ఉల్లిపాయ ముక్కలు (చీలికలుగా), టొమేటో ముక్కలు, పచ్చిమిర్చి చీలికలు, ఉప్పు, కారం, కరివేపాకు వేసి బాగా మరిగించి పోపు వేసి మరగనిచ్చి వాడుకోవాలి. వేసవి కాలం పెసరపప్పు చారు చేసుకుంటే బావుంటుంది.

కథా నిలయం



# ప్రతీక్ష

భూమికోసం, భుక్తి కోసం పోరాడుతున్న పేద ప్రజానీకానికి సత్యభాస్కర్ సంపాదకత్వంలో తంగిరాల చక్రవర్తి (7),తంగెళ్ళపల్లి కనకాచారి (7), డా॥ విప్లవ్ దత్ శుక్లా...(7), డి. రవికుమార్ (7), వొరప్రసాద్ (5) జి. యాదగిరిరావు (3) రాసిన మొత్తం 43 కవితల ప్రతిఘటనోద్యమాల 'ప్రతీక్ష' ఇది. వ్యవస్థ మహా భయంకరంగా పతనమవు తున్నప్పుడు హెచ్చరించే పని మేధావులైన రయితలూ, కవులదే. కాని పాలకవర్గం వీళ్ళనస్సలు పట్టించుకోదు. వాళ్ళ ఉనికి ప్రశ్నార్థకమవుతుందన్న భయాందోళనలే ముఖ్య కారణం.

కవిత్వం వాస్తవంతో పాటు ప్రగతిశీల అవగాహనను అర్థం చేసుకొని, ఉద్యమస్ఫూర్తితో జన సందోహాన్ని కదిలించ గల్గుతుంది. అంటే, వూరికే ఇంట్లో కూర్చుండి, పిడికిళ్ళు బిగించుకోవడం కాదు. కార్పొరేట్ సంస్కృతి కబళించే వ్యవస్థను ఎదురొడ్డడానికి సన్నిహితులు కావడం అనే ప్రక్రియను ప్రారంభించడం అన్నమాట. సత్యభాస్కర్ 'మనీ ప్లాంట్ పెంచే పరాన్న భుక్కులూ.... కొంగల్లాంటి దొంగ పాలకులూ' అంటే - 'పోరు బాటలో కలం-హలం చేస్తూ ప్రశ్నిస్తారు, శిక్షిస్తారు' తంగిరాల చక్రవర్తి. తంగెళ్ళ పల్లి కనకాచారి 'గూడు' - 'ఔట్ డేటెడ్' - అంటూ 'ఆశ'లను చిగురింప చేస్తారు. డా॥ విప్లవ్ దత్ శుక్లా దోపిడి గురించి ఆవేదనగా చెప్పి తిరగబడండి అని ప్రబోధిస్తారు. 'ఆధిపత్యం హద్దులు మీరి పొగచూరిన ఆకాశం' గురించి అక్షరోదయం రంగులు' డి. రవి కుమార్ గారు గుభాళించి చూయిస్తే, వొరప్రసాద్ 'సాఫ్ట్‌వేర్ దోపిళ్ళు'- 'అజాత శత్రువు' గురించి హెచ్చరిస్తారు. జి. యాదగిరి రావు పాత ముచ్చట 'కులవ్యవస్థ'నే కొత్త రూపంగా ముందుంచారు. 'జన్మ హక్కు' గురించీ నినదించారు. ఏది రాసినా, వర్ణించినా, కవి భావనలూ, బలమూ ఆఖరకు కవితలకే బలాన్ని ఆపాదించి పెడతాయి. 106 పేజీల్లో కొన్ని కవితలు ఇరికిరికి దర్శన మిచ్చినా - పుస్తకం ఆఖర్న కవుల చిరునామాలు 'ఇంకా దర్శన మివ్వని' కవితల 'అతాపతా' తెలుపుతాయి. కవితలు చదివి 'ఆఁ! అన్నా' 'ఓహో' అనుకున్నా ఇంకొన్ని కొత్త కవితల కోసం ప్రతీక్షించవచ్చు కాబోలు.

**ప్రతీక్ష (కవితా సంకలనం)**
**సంపాదకులు**
**సత్యభాస్కర్, వెల : రూ 30/-,**
**పేజీలు - 106,**
**ప్రతులకు - సాహితీ స్రవంతి,**
**ప్రజాశక్తి బుక్ హౌజ్, అన్ని ప్రముఖ**
**పుస్తక కేంద్రాలు.**

**- డా॥ జె.పి. వైద్య**




## 'నానీల నాన్న'పై నానీలు

**సంపాదకుడు : మల్లయ్య**
**వెల: 30/-, పేజీలు: 34**
**ప్రతులకు:**
**అనురాధ**
**ఇం.నెం.5-12-201,**
**మంగాపురం కాలనీ, మౌలాలీ,**
**హైదరాబాద్.**

## మేకులు కొట్టిన గోడ

**(సరోజ వృత్తం)**
**తాళ్లూరి లాబన్ బాబు**
**వెల: 50/-, పేజీలు: 100**
**ప్రతులకు: విశాలాంధ్ర, ప్రజాశక్తి,**
**నవోదయ, సహచర, సమాంతర,**
**మైత్రి, దిశ,**
**మణి బుక్ హౌస్.**




# బతుకు పోరాటం

తెలుగు సాహిత్యంలో 'నవల'ది సింహభాగంగానే గుర్తింపు పొందింది. అందునా తెలంగాణాకు సంబంధించి 'నవల'ది ప్రముఖమైన పాత్రనే చెప్పాలి. 'జీవితాన్ని' విస్తారంగా చెప్పడమనే సౌలభ్యం ఉండటం, నవలలో పరిపూర్ణ జీవిత చిత్రాన్ని ఇవ్వగలిగే స్కోప్ ఉండటం తెలంగాణా పల్లె జీవితాన్ని నలు మూలలకు మోసుకెళ్ళింది. నేల మీద నడిచే రచనకే జీవముంటుంది. ఈ లక్షణమే 'జీవన సమరం' నవలను పాఠకులకు చేరువ చేసింది. రచయిత ఎమ్. వి. తిరుపతయ్య అరవైల్లో తెలంగాణ ప్రాంత ప్రోగ్రెసివ్ పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నవాడు. అంతేకాక కళాశాలలో చదువు చెప్తూ 'న్యాయం' కథ రాసి కళాశాల యాజమాన్యానికీ, పాలక వర్గానికి దూరమై నిర్బంధం ఎదుర్కొన్నారు. ఇంతటి ప్రత్యక్ష సంబంధాలుండడం వల్లనే రచయిత తెలంగాణ 'డాక్యుమెంట్'గా ఈ నవలను తీర్చి దిద్దారు. 'తెలంగాణ'లో బతకడం కోసం సామాన్య ప్రజలు ఎంత పోరాటాన్ని చేయాల్సి వస్తుందన్న విషయాన్ని అత్యంత సహజంగా చిత్రించారు. ఈ నవలలో పాత్రల సంభాషణలుగానీ, పాత్రల పరిచయంగానీ చాలా సింపుల్‌గా తమ అస్థిత్వాల్ని మోసుకొస్తాయి. కల్లుపాకల దగ్గర నుండి పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల వరకు తను పరిశీలించిన అనేకానేక విషయాల్ని ఈ నవలలోని ప్రధాన పాత్ర (నందు) ద్వారా వ్యక్తపరిచారు.

"సమాజం పట్ల ఒక నిర్దిష్టమైన అభిప్రాయంతో సొంత వ్యక్తిత్వం కలిగిన మెకానిక్ బాలమల్లు జైలుకు పోవడం, అతన్ని చూడటానికి జైలుకెళ్ళిన చిన్న కొడుకు 'నందు' జీవితంలో జరిగిన అనేకానేక సంఘటనల నేపథ్యంలో ఇటు సాయుధపోరాటం, అటు శాంతి భద్రతల పేరుతో జరుగుతున్న రక్త పాతాన్ని రెండూ కాదని 'నందు' కనే ఓ కలతో పూర్తవు తుందీ నవల. చేతనావస్థలోని 'నందు' యవ్వనారంభ 'కల' నిజ మవ్వాలని రచయిత మార్గం అను సరణీయ మైనదని పాఠకుడు 'నవల'తో తాదాత్మ్యం చెందు తాడనడంలో సందేహం లేదు. తెలంగాణా నుడికారంతో నుండే సామెతలను సందర్భానుసారంగా ఉపయోగించు కోవడం, నిత్యం తమ మధ్యలో నుండే పాత్రలను ప్రవేశ పెట్టడం 'ఆదర్శీకరణ' లేని ప్రధాన పాత్రలుండటం వంటి విషయాల్లో రచయిత సజీవతను సాధించారు. "ప్రజాస్వామ్యంలో చాలా లోపాలు న్నాయి. ఆలోపాల్ని రూపు మాపాలంటే, ప్రజలందరూ విద్యావంతులు కావాలి. వాళ్ళ చైతన్య పరిధి విస్తరించాలి. ధనబలం కండ బలాలకు ఎన్నికల్లో చోటు లేకుండా చేయాలి' (పేజీ 280) అని 'నందు' పాత్ర స్వగతంలో చెప్పుకున్న 'తన' (రచయిత) కోర్కెను తీర్చడమే పాఠకులు రచయితకిచ్చే ఘన నివాళి.

**జీవన సమరం,**
**ఎం.వి. తిరుపతయ్య,**
**వెల: 120/-, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక షాపులు.**

**- సైదులు ఐనాల**

# పిట్ట కొంచం... కూత ఘనం







ఏంటి...? అలా నోరు తెరుచుకుని వుండిపోయారు? అదీ...ఆ పిల్లవాడు...కార్ల కింద నుంచి స్కేటింగ్ చేయడం ఎలా సాధ్యమైంది?

**ఓ...అదా! మీకు అసలు విషయం తెలిస్తే... ఓ అర్థగంట సేపు నోట మాట రాదు తెల్సా.**

అంత వుందా! మరి ఆలస్యం ఎందుకు? అదేంటో చెప్పండీ...

**ఈ పిడుగు 45 సెకన్లలోపు 54 కార్ల కిందనుంచి స్కేటింగ్ చేస్తూ బయటకు వచ్చాడు తెల్సా. తను అలా వచ్చేటప్పుడు భూమికి 8 అంగుళాల ఎత్తులో వుంటాడు. తన కాళ్లు, చేతులు అడ్డంగా పొడవుగా చాచి ఈ ఫీట్ చేశాడు. ఇది వరల్డ్ రికార్డు పుస్తకంలో నమోదు కాలేదు కానీ... అంత రికార్డు సృష్టించింది.**

వావ్! ఇంతకీ ఆ పిల్లవాడి పేరేంటి? వివరాలేంటి?

**అనికెట్ రమేష్ చిందాక్. వయసు ఆరేళ్లు. కర్ణాటక లోని బెల్గామ్ వాసి.**

ఔనూ... ఇంతకీ ఈ చిన్నారికి ఇలా కార్ల కింద నుంచి స్కేటింగ్ చేయాలని ఎందుకనిపించిందీ....? ఎవరిని చూసి ప్రేరణ పొందాడంటారు?

**ఒక్కొక్కరికి ఒక్కో టేస్టు.. వుంటుందండీ. మీకేమైనా అభ్యంతరమా! రెండేళ్ల క్రితం టీవీలో ఓ పాప కారు కింది నుంచి స్కేటింగ్ చేయడం చూశాడు. అంతే తనూ అలా చేయాలని అప్పుడే డిసైడ్ అయిపోయాడు అనికెట్.**

ఇలాంటి పిల్లలను చూసే 'పిట్ట కొంచెం...కూత ఘనం' అన్న సామెత పుట్టి వుంటుంది. ఇంతకీ ఈ ఫీట్ చెయ్యడానికి ఎంత కాలం ప్రాక్టీస్ చేశాడో.

**ఈ విషయంలో చెప్పాలంటే చాలా వుంది. తను 18 నెలల పిల్లవాడిగా వున్నప్పటినుంచే స్కేటింగ్ నేర్చుకోవడం మొదలెట్టాడు. అయితే టీవీలో పాపను చూసిన దగ్గర నుంచి అలా కార్ల నుంచి కూడా స్కేటింగ్ చేయడం నేర్చుకోసాగాడు. రోజుకి మైళ్లకు మైళ్లు స్కేటింగ్ చేస్తుంటాడు.**

అవునూ... ఆరేళ్ల వయసులోనే ఇంత ఫీట్ చేశాడు కదా. పెద్దయ్యాక ఏం చేస్తాడో!

**ఆ ముచ్చటేమోగానీ... ప్రస్తుతం ఆ పిడుగు ఆలోచనంతా తను సృష్టించిన రికార్డును తనే బద్దలు కొట్టాలన్నదానిమీదే వుంది. వంద కార్ల కింద నుంచి స్కేటింగ్ చేయాలనుకుంటున్నాడు.**

అ...వు...నా! వంద కార్ల కింద నుంచి రావడమంటే...మా...ట..లా! ఎంత శిక్షణ వుండాలి!

**మరి అందుకేగా రోజుకి నాలుగు గంటల పాటు ప్రాక్టీస్ చేస్తున్నాడు. అనికిత్ త్వరలో ఆ రికార్డు కూడా సృష్టించాలని ఆశిద్దాం!**

# అందం

కె.సాహిల్

ఆ అడవిలో మందాకిని అని ఓ నెమలి వుంది. దానికి చాలా గర్వం. 'ఎందుకంట?' అన్న అనుమానం వస్తుంది ఎవరికైనా. పెద్ద కారణమే వుంది. ఎందుకంటే.... దానికి బోలెడన్ని నెమలి పింఛాలున్నాయని! ఇంద్రధనస్సులో వున్న రంగులన్నీ తన పింఛాలలో వుంటాయని!! ఇంక దానికి ఒకటే పని. ఏ కొంచెం పిల్లగాలి వీచినా చాలు పురి విప్పి అందంగా నాట్యం చేస్తుంది. అంతేకాదు అక్కడ వున్న జంతువులను కూడా చూడమంటుంది. తన అందం గురించి గొప్పలు చెప్పకుంటుంది. అంతటితో ఆగదు. తన నడక కూడా ఎంతో అందంగా వుంటుందని బడాయిలు చెప్తుంది. ఇంక ఆ అడవిలోకి కొత్తగా ఏ జంతువైనా, పక్షైనా, కీటకమైనా వస్తే చాలు. వాటిని ఆపి మరీ తన అందం గురించి, నడక గురించి గంటల తరబడి చెప్తుంది. డాన్స్ చేసి చూపిస్తుంది.

ఇంత వరకు పరవాలేదు. ఎలాగోలా భరించవచ్చు. కానీ ఎదుటివారిని కించపరిచే విధంగా మాట్లాడుతుంది. వారిలోని లోపాలను ఎత్తిచూపి ఎగతాళి చేస్తుంది. అందుకే మందాకిని వస్తుందంటే చాలు ఎక్కడి పక్షులు అక్కడ, ఎక్కడి జంతువులు అక్కడ... దాక్కుంటాయి. పొరపాటున దాని కళ్ల బడ్డాయా అంటే చాలు అయిపోయినట్టే... పురాణం అంతా మొదలెడుతుంది.

* * *

ఓసారి ఓ కాకి చెట్టుమీద కూర్చుని మాంసం తింటూ వుంది. దాన్ని చూసింది నెమలి. వయ్యారంగా నడుచుకుంటూ వెళ్లి ...

"కాకి బావా! కాకి బావా!! ఏంటి ఏదో తింటున్నట్టున్నావ్? నిన్ను చూస్తే నాక్కూడా తినాలని వుంది... " అంటూ పలుకరించింది.

నెమలి సంగతి కాకికి బాగా తెలుసు. లోలోపల "అబ్బా... కడుపునిండా ప్రశాంతంగా తిందామని ఇక్కడ కూర్చుంటే ఇది పట్టుకుందే" అనుకుంటూనే ...పైకి మాత్రం నవ్వుతూ నోటిలోని మాంసాన్ని కాళ్ల కింద పెట్టుకొని

"హాయ్ నెమలి బావా! ఏంటి కమ్మగా కడుపునిండా తిన్నట్టున్నావ్. వయ్యారంగా నడుచుకుంటూ ఇలా వచ్చావ్!" అంది.

"ఆ... ఆ... అది సరేగాని... ఇదిగో నా పింఛాలు చూశావా! ఎంత అందంగా మెరుస్తున్నాయో చూడు. ఇప్పడే నదిలో స్నానం చేశాను. అందుకే పింఛాలకు ఆ మెరుపు. నాకు మాత్రం కడుపుకు అన్నం తిన్నా తినకపోయినా ఇదిగో ఇలా శుభ్రంగా రోజూ స్నానం చేయాల్సిందే సుమా! కానీ కొంతమంది వుంటారు చూడు. శరీరం ఎలా వుందో పట్టించుకోరుగానీ... కడుపుకు మాత్రం సందు లేకుండా తింటారు. యాక్! వాళ్లను చూస్తేనే వాంతి వస్తుందనుకో. కానీ బావా నల్లటి వాళ్లంటే నాకు అస్సలు గిట్టదు. అదేంటోగానీ బావా నీకు ఒక్కటైనా తెల్లటి ఈక వుంటే బావుండేది. మొత్తం మసిబొగ్గు పులిమినట్టు నల్లగా... ఏం బావుండదు నీకు. పోనీ ఓ పని చేయరాదూ! నా పింఛాలు అప్పుడప్పుడు రాలిపోతుంటాయి. వాటిని నీ వంటికి కట్టుకోరాదూ... కాస్తన్నా అందంగా వుంటావు?!' అంది కళ్లు తిప్పతూ...

ఆ మాటలు పాపం కాకిని ఎంతగానో బాధపెట్టాయి. కానీ ఏం చేయలేదుకదా. మాట్లాడకుండా కాళ్లకింది మాసం ముక్కను నోట కరుచుకొని ఎక్కడికో వెళ్లిపోయింది.

ఆ పక్కనే చెట్టుమీద వున్న కొంగ ఇదంతా చూస్తూనే వుంది. నెమలి మాటలు దానికి కూడా బాధ కలిగించాయి. 'పాపం కాకి' అనుకొంది. నెమలికి ఆరోజు ఒక గుణపాఠం నేర్పాలని మాత్రం అనుకుంది. వెంటనే వెళ్లి సరిగ్గా నెమలి ముందు వాలింది.

'ఏంటిది? నన్ను చూసిన ప్రతి ఒక్కరూ పారిపోతారు. ఇదేంటి ధైర్యంగా వచ్చి ముందర వాలింది?' అనుకుంటూ....

"ఏం కొంగ బావా! ఎలా వున్నావు? అదేంటి? నీ ఈకలు అలా వున్నాయి. సున్నంగానీ పులుముకున్నావా ఏంటి?" అంది.

"ఆ... ఏం పూసుకుంటాంలే నెమలి బావా! అయినా నీ అందం ఎవరికొస్తుంది చెప్ప. ఏం పూసుకున్నా ... ఏం రాసుకున్నా... అందం అంటే నీదే" అంది.

కొంగ మాటలకు లోలోన పొంగిపోతూనే... "కానీ బావా! నీ రెక్కలేంటి? అక్కడక్కడ బూడిద పూసినట్టున్నాయి? నా పింఛాలు చూడు... చిత్రకారుడు బొమ్మ వేసినట్టు వుంటాయి. .... అయినా నా అందం ఎవరికొస్తుందీ..." అంటూ వయ్యారంగా పురి విప్పి నృత్యం చేయడం మొదలెట్టింది.

ఈ లోపు అటుగా ఓ వేటగాడు వస్తుంటాడు. అది చూసిన కొంగ "అందమైన రెక్కలుంటే సరిపోదు. కాస్త ఎగరడం కూడా రావాలి. అదుగో అటుగా వేటగాడొస్తున్నాడు. నేను ఎగురుకుంటూ వెళ్లిపోతాను. నువ్వ చేతనైతే వేటగాడి నుంచి తప్పించుకో. లేకపోతే వాడి వలలో చిక్కుకొని చావు" అంటూ రెక్కలు టపటపలాడిస్తూ... వెళ్లిపోయింది. అంత అందమైన ఈకలున్నా ఎగరలేని నెమలి వేటగాడి చేతికి చిక్కి విలపించింది.